ప్రజాశక్తి

శుక్రవారం 16 మే 2025 12 పేజీలు



ప్రకాశం



బాపట్ల



రాస్తారోకో చేస్తున్న పొగాకు రైతులు

ధర లేక..రోడ్డెక్కారు..

- గిట్టుబాటు ధర రాక
- పొగాకు రైతుల రాస్తారోకో
- వేలాన్ని నిలిపివేసి..ఆందోళన

ప్రజాశక్తి-కొండపి

గిట్టుబాటు ధర రాక పొగాకు రైతులు రోడ్డెక్కారు. ధర తగ్గితే కూలీలకే సరిపోవని ఆందోళన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధర కల్పించాలని రాస్తారోకో చేశారు. కొండపిలోని పొగాకు వేలం కేంద్రంలో గురువారం నేతి వారిపాలెం, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 1,210 బేళ్లను తీసు కొని వచ్చారు. వేలం ప్రారంభం నుంచి పొగాకు ధరలను తగ్గిస్తూ బయ్యర్లు కొనుగోలు చేస్తున్నారు. మంచి గ్రేడ్ పొగాకును కూడా తక్కువ ధరకి కొనుగోలు జరపడంతో 17 బేళ్ల వేలం ముగిసిన తర్వాత రైతులు వేలాన్ని బహిష్కరించారు. పొగాకు గిట్టుబాటు ధర కల్పించాలని గిట్టుబాటు ధర కల్పించే వరకు వేలంలో పాల్గొనబోమని వేలం నిర్వహణ అధికారి సునీల్ కుమార్‌తో రైతులు తేల్చి చెప్పారు. వేలం నిర్వహణ అధికారి కూడా రైతుల పక్షాన నిలిచి ▶ 2లో

లోకేష్‌ను కలిసిన పొగాకు రైతులు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ అమ్మనబ్రోలుకు చెందిన పలువురు పొగాకు రైతులు మంత్రి లోకేష్‌ను కోరారు. వీరయ్యచౌదరి కుటుంబసభ్యులను పరామర్శించేందుకు వచ్చిన లోకేష్‌ను పొగాకు రైతులు కలిసి గిట్టుబాటు ధరలు లేవని విన్నపించారు. వెంటనే మంత్రి లోకేష్ స్పందించి వ్యవసాయశాఖామంత్రి అచ్చెన్నాయుడికి ఫోన్ చేసి పొగాకు రైతుల సమస్యను ఆయన దృష్టికి తీసుకుపోయారు. మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ ఈ విషయంపై పొగాకు కంపెనీలు, బోర్డు అధికారులతో మాట్లాడుతున్నట్లు చెప్పారు. సాధ్యమైనంత త్వరగా పొగాకు రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేష్ సూచించారు.

అండగా ఉంటా..

- వీరయ్యచౌదరి కుటుంబసభ్యులకు నారా లోకేష్ పరామర్శ
- చదలవాడలో లోకేష్‌కు ఘనస్వాగతం పలికిన జిల్లా నేతలు



వీరయ్యచౌదరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లోకేష్

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో, నాగులుప్పలపాడు

ఇటీవల ఒంగోలులో హత్యకు గురైన నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి కుటుంబసభ్యులను ఐటి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ గురువారం ఉదయం అమ్మనబ్రోలులో పరామర్శించారు. చదలవాడకు హెలికాప్టర్‌లో చేరుకున్న ఆయనకు ఉమ్మడి ప్రకాశం జిల్లా మంత్రులు డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్‌తో పాటు జిల్లా ఎమ్మెల్యేలు, నాయకులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన అమ్మనబ్రోలుకు చేరుకున్న లోకేష్ వీరయ్యచౌదరి ఇంటికి వెళ్లారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. అనంతరం వీరయ్యచౌదరి సతీమణి, కుమారుడు, కుటుంబసభ్యులను లోకేష్ పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. వీరయ్యచౌదరితో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. యువగళం పాదయాత్రలో తనతో పాటు అడుగులు వేశారని, పార్టీ పటిష్టత కోసం కృషి చేసిన వీరయ్యచౌదరి దారుణ హత్యకు గురవ్వడం బాధాకరమన్నారు. వీరయ్య కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అరగంటకు పైగా వారితో మాట్లాడారు. వారికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ అన్సారియా, ఎస్పీ దామోదర్, మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, స్థానిక ఎమ్మెల్యే విజయ్‌కుమార్, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుమల అశోక్‌రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, వ్యవసాయ కమిషన్ వైస్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య, టిడిపి దర్శి ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి, వైపాలెం ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు, పిడిసిసి బ్యాంకు ఛైర్మన్ డాక్టర్ కే.సీతారామయ్య, జనసేన నేత రియాజ్, రవిప్రియ గ్రూపు అధినేత రవిశంకర్ పాల్గొన్నారు.

నిందితులకు 14 రోజుల రిమాండ్

- జిల్లా జైలుకు తరలించిన పోలీసులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నాగులుప్పలపాడు మాజీ ఎంపిపి ముప్పవరపు వీరయ్య హత్య కేసులో నిందితులకు 3వ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ గురువారం నాడు 14 రోజుల రిమాండ్ విధించారు. వీరయ్య హత్యకేసులో 9 మంది నిందితులు బోర్లగుంట వినోద్‌కుమార్, తువ్వర వంశీకృష్ణ, బెల్లంకొండ వెంకట గౌతమ్, మన్నెం తేజ, మార్పూరి కిరణ్ కుమార్, షేక్ సమీర్, ఆళ్ళ సాంబశివరావు, వీరగంధం దేవేంద్రనాథ్ చౌదరి, తోటా శ్రీనివాసులను పోలీస్ బందో బస్తు నడుమ పోలీసులు ఒంగోలు 3వ ఏడిఎం ఎదుట హాజరు పరిచారు. నిందితులను విచా రించిన న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. నిందితులను జిల్లా జైలుకి తరలించారు.



మంత్రి లోకేష్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు ఉగ్ర, దామచర్ల

బల్లుపల్లిలో త్రిపుల్ ఐటి కళాశాల.!

ఎమ్మెల్యే ఉగ్రకు మంత్రి లోకేష్ స్పష్టం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

పామూరు వద్ద శంకుస్థాపన చేసి.. వదిలేసిన త్రిపుల్ ఐటి కాలేజీ విషయంపై కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ప్రత్యేకంగా మంత్రి లోకేష్‌తో చర్చించారు. అమ్మనబ్రోలులో వీరయ్య చౌదరి కుటుంబసభ్యులను పరామర్శించిన అనంతరం ఎమ్మెల్యే ఉగ్ర మంత్రి లోకేష్ కారులో ప్రయాణించారు. అప్పుడు త్రిపుల్ ఐటి కాలేజీ విషయం ఆయనతో చర్చించారు. గతంలో సిఎం చంద్రబాబు పామూరు మండలం, దూబగుంట వద్ద శంకుస్థాపన చేసిన విషయాన్ని వివరించారు. ఇప్పుడు దాన్ని వెంటనే చేపట్టాలని ఉగ్ర కోరారు. ఎక్కడ ఏర్పాటు చేస్తే బాగుంటుందని మంత్రి లోకేష్ అడిగారు. కనిగిరి–పామూరు మధ్య బల్లుపల్లి వద్ద ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి సూచించారు. దీంతో లోకేష్ స్పందిస్తూ అక్కడే ఏర్పాటు చేద్దామని స్పష్టం చేశారు. నిధులిచ్చి పనులు మొదలుపెట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే ఉగ్ర 'ప్రజాశక్తి'కి తెలిపారు. దీంతో ఎట్టకేలకు త్రిపుల్‌ఐటిపై స్పష్టత వచ్చింది.

అందుబాటులో వాట్సాప్ గవర్నెన్స్ సేవలు

క్యూఆర్ కోడ్ సేవలు ప్రారంభించిన కలెక్టర్ తమీమ్అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం 'మన మిత్ర–ప్రజల చేతిలో ప్రభుత్వం' ద్వారా వాట్సాప్ గవర్నెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిందని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పిలుపు నిచ్చారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో వాట్సాప్ గవర్నెన్స్ సేవలపై రూపొందించిన క్యూఆర్ కోడ్ సేవలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 161 ప్రభుత్వ సేవలు మొదటిసారిగా అందుబాటులోకి తీసుకువచ్చిందని, ఈ సేవలు సాంకేతికంగా, సురక్షితంగా ఉంటాయన్నారు. ప్రజల గోప్యతకు అధిక ప్రాధాన్య మిచ్చినట్లు ప్రభుత్వం స్పష్టం చేసిందని కలెక్టర్ తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా తొలి దశలో 161 ప్రభుత్వ సేవలు, రెండో విడతలో 360 రకాల సేవలను అందుబాటులోకి తీసుకువస్తాయని తెలిపారు. దేశంలోనే మొదటిసారిగా రాష్ట్రంలో వాట్సాప్ పాలనను అమలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. వాట్సాప్ ద్వారా వివిధ సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ సమాచారం కూడా ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఇందుకోసం 9552300009 మొబైల్ నంబర్‌ను వాట్సాప్ ద్వారా వినియోగించుకోవచ్చని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఈఓ బి.చిరంజీవి, డిపిఓ జి.వెంకట నాయుడు, డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నారాయణ, మెప్మా పిడి శ్రీహరి, సిపిఓ డి.వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ బాల శంకర రావు పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్ సేవలను ప్రారంభిస్తున్న కలెక్టర్

వ్రతం చెడినా ఫలితమేదీ?

ప్రజాశక్తి-మార్కాపురం

వ్రతం చెడినా... ఫలితం దక్కలేదు... అనే సామెత మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ విషయంలో సరిగ్గా సరిపోతుంది. రాష్ట్రంలో అధికార కూటమి పంచన చేరిన కొద్ది రోజుల్లోనే మున్సిపల్ చైర్మన్ అధికార పార్టీ నేతలతో కమిట్ అయ్యారనేది బహిరంగ రహస్యమే. అయినా చైర్మన్ పదవి చిర్లంచెర్ల కాపాడుకోలేకపోతున్నారనే విషయం ప్రస్తుతం చర్చనీయాంశమైంది.

మార్కాపురం మున్సిపాలిటీలో 35 వార్డుల్లో 30 వార్డుల్లో వైసిపి గెలుపొందింది. టిడిపి ఐదు స్థానాలకే పరిమితమైంది. వైసిపిలో చైర్మన్ పదవి కోసం చిర్లంచెర్లతో పాటు డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ అప్పట్లో పోటీ పడ్డారు. అప్పటి ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి వారిద్దరి మధ్య పంచాయతీ చేశారు. ఐదేళ్ల పదవీ కాలాన్ని చెరిసగం ఒప్పందంతో ఆ ఇద్దరినీ అంగీకరింపజేశారు. చైర్మన్ చిర్లంచెర్ల అప్పట్లో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించారు. ఈ విషయం స్వపక్ష కౌన్సిలర్లకూ మింగుడుపడలేదు.

మున్సిపాలిటీ పరిధిలో వార్డులకు కేటాయించే పనుల్లోనూ చిర్లంచెర్ల స్వపక్ష కౌన్సిలర్ల విషయంలో వివక్ష చూపారనే ఆరోపణలు ఉన్నాయి. కమీషన్‌లు ఎక్కువ ఇచ్చిన వారికి పెద్దపీట వేశారనేది నిజం. కమీషన్ కక్కుర్తిలో స్వపక్ష కౌన్సిలర్లను కూడా వదల్లేదని తెలిసింది. కమీషన్ ఇవ్వలేదనే సాకుతో స్వపక్ష కౌన్సిలర్లు చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు కూడా నిలుపుదల చేయించారనే అపవాదు చిర్లంచెర్లకు దక్కింది. తామంతా లేకుండా చైర్మన్ కాగలిగావా? అని ఎదురు వాదనలు కూడా జరిగాయి. చైర్మన్ చిర్లంచెర్ల మాత్రం పైసా వసూల్ తప్ప మరొకటి లేదన్నట్లు వ్యవహరించారని కౌన్సిల్ అంతా కోడై కూసింది. చిర్లంచెర్ల ధనదాహానికి కొందరు అధికారులు సైతం వసూలు చేయలేక ఇబ్బందులు పడినట్లు తెలిసింది. మొత్తానికి స్వపక్ష కౌన్సిలర్లు కూడా చిర్లంచెర్ల వ్యవహారంతో ఆర్థికంగా కొంత దెబ్బతిన్నారు. వార్డుల్లోనూ సమస్యల పరిష్కారంలో వెనుకబడ్డారు. చైర్మన్ చిర్లంచెర్లను తొలగించేందుకు ఎప్పుడెప్పుడా అని అవిశ్వాస సమయం కోసం ఎదురు చూశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడటం, ఇక్కడ ఎమ్మెల్యేగా కందుల నారాయణరెడ్డి గెలవడం జరిగిపోయాయి. అదును కోసం ఎదురుచూసిన కౌన్సిలర్లకు అవిశ్వాస అస్త్రం దొరికింది. అధికార టిడిపితో కలిసిపోయారు. వైసిపికి చెందిన 12 మంది కౌన్సిలర్లు టిడిపిలో చేరారు. వైసిపిలో కొనసాగుతున్న మరో ఆరుగురు కౌన్సిలర్లు అధికార టిడిపికి అనుకూలంగా ఉన్నారు. అవిశ్వాస నోటీసులో సంతకాలు కూడా చేశారు. త్వరలో అవిశ్వాసానికి తేదీ ఖరారు కానుంది. ఆ రోజున అధికార టిడిపి అవిశ్వాసం నెగ్గే అవకాశాలు మెండుగా ఉన్నాయి. చైర్మన్ చిర్లంచెర్ల పదవీచ్యుతుడు కావడం ఖాయమనేది తెలుస్తోంది. అధికార టిడిపితో చైర్మన్ చిర్లంచెర్ల 30-70 శాతం లెక్కన పనులు చేసుకుందాం... బిల్లులు సకాలంలో అయ్యేలా సహకరించుకుందాం... అధికార పార్టీకి అనుకూలంగా ఉంటానని ఒప్పందం చేసుకున్నా కూడా... అవిశ్వాసంతో చైర్మన్ పదవి నుంచి చిర్లంచెర్లను తొలగించేందుకు టిడిపి రంగం సిద్ధం చేయడంతో చిర్లంచెర్ల వ్రతం చెడినా... ఫలితం దక్కలేదనే చర్చ నడుస్తోంది.!



మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ

ధర కోసం..రోడ్డెక్కారు.!

(మొదటిపేజీ తరువాయి)

వ్యాపారులతో రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా కొనుగోలు చేయాలని నినాదాలు చేశారు. రైతులు రాస్తా రోకో చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రజలు ఇబ్బంది పడకూడదని కొంచెం సేపటికి ధర్నా విరమించి రైతులు తమ గ్రామాలకు తిరిగి వెళ్లారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వేలం ప్రారంభంలో ఎఫ్-2 రకం బేళ్లు కేజీ ధర రూ.280 పలికిన బేళ్లు గురువారం రూ.250 నుంచి రూ.270 మాత్రమే పలుకుతోందని, అదేవిధంగా ఎఫ్-3 బేళ్లు మొదట్లో రూ.250 నుంచి రూ.240 పలికగా.. గురువారం రూ.210 వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత తక్కువ ధరకు అమ్మితే కూలీలకు కూడా డబ్బులు సరిపోవని, తక్కువ ధరకు బేళ్లు అమ్ముకొని కూలీలకు కూడా డబ్బులు సరిపోక కూలీలకు సమాధానం చెప్పుకోలేని స్థితిలో రైతులున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవే ధరలు కొనసాగితే పొగాకు రైతు తీవ్ర అప్పుల ఊబిలో కూరుకుపోతారని, వెంటనే అధికారులు, ప్రభుత్వాలు స్పందించి గిట్టుబాటు ధర కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కేజీ మస్తాన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే దిగివచ్చి పొగాకు రైతులకు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన నిలబడాల్సిన బోర్డు అధికారులు వ్యాపారులతో లోపాయకారీ ఒప్పందం కుదుర్చుకొని రైతులను మోసం చేస్తున్నారన్నారు. మద్దతు ధర కల్పించకపోతే రానున్న రోజులలో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

రైతులతో చర్చలు జరిపిన అధికారులు

వేలాన్ని బహిష్కరించి తమ గ్రామాలకు రైతులు వెళ్లారు. వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్, కొండపి బోర్డు పొగాకు ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షుడు భాస్కర్, పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య నేతివారిపాలెం రైతులతో చర్చించారు. పొగాకు మద్దతు ధరతో కొనుగోలు చేసే విధంగా వ్యాపారులతో మాట్లాడి మంచి ధర పలికే విధంగా చూస్తానని హామీ ఇవ్వడంతో రైతులు తిరిగి వేలం కేంద్రానికి వచ్చారు. రైతులు తిరిగి రావడంతో వేలాన్ని ప్రారంభించారు.

రాష్ట్రంలో సమగ్ర విద్యాభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రాష్ట్రంలో విద్యా రంగానికి సంబంధించి ప్రజలు, విద్యావేత్తలు వ్యక్తం చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో, ప్రభుత్వం పలు కీలక అంశాలను గమనించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర మీడియా కార్యదర్శి అబ్దుర్ రఖీబ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వైద్య విద్యలో ప్రైవేటీకరణ పెరిగిపోవడం వల్ల సామాన్య ప్రజలకు ఇది అందుబాటులో లేకుండా పోతోందని అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను బలోపేతం చేయడంతో పాటు, ప్రైవేట్ కళాశాలలపై గట్టి నియంత్రణ ఉండాలని అన్నారు. వైద్య విద్యను వ్యాపారంగా మార్చకుండా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో అనియంత్రిత ఫీజులు విద్యార్థులపై ఆర్థిక భారం మోపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా పట్టణ అధ్యక్షుడు షేక్ రియాజ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు డ్రాయింగ్‌పై శిక్షణ ఇచ్చారు. వారిచే బొమ్మలు గీయించి రంగులు రుద్దించారు. స్టోరీలు రాయడం, ఇంగ్లీష్ డిక్టేషన్, వార్తలు చదవడం చేయించారు. వీటితో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ప్రతిరోజూ స్నానం చేసి ఉతికిన బట్టలు ధరించాలని ఆరోగ్య విద్యను బోధించారు. అనంతరం విద్యార్థులు కొద్దిసేపు కోలాటం ప్రాక్టీస్ చేశారు. ఈ కార్యక్రమాలు గ్రంథ పాలకురాలు కటికల ఝూన్సీ ఆధ్వర్యంలో నిర్వహించగా 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

గుంతలమయంగా మురారిపల్లి రోడ్డు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నుంచి పుల్లలచెరువు వెళ్లే రహదారిలో మురారి పల్లి వరకు రహదారి అధ్వానంగా మారి ప్రజలకు అవస్థలు తెచ్చిపెడుతోంది. ఈ రహదారిపై ప్రతి రోజూ ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్సులు, వాణిజ్య వాహనాలు వెళ్తున్నా కూడా రహదారి స్థితిగతులపై అధికారుల ఆసక్తి ఏమాత్రం కనిపించడం లేదు. రహదారి మొత్తం గుంతలతో నిండి, పగుళ్లతో వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలతో రహదారిలో ఉన్న గుంతల్లో నీరు నిలిచిపోయి వాహనదారులకు దారి తప్పే పరిస్థితి ఏర్పడింది. రాత్రి వేళల్లో ప్రయాణాలు మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి. ఇప్పటికే కొన్ని వాహనాలు అదుపుతప్పి చిన్న ప్రమాదాలకు గురయ్యాయి. పాదచారులు, వృద్ధులు, విద్యార్థులు ఇలా ప్రతి ఒక్కరికీ ఈ రహదారి కష్టంగా మారింది. ప్రజలు పలుమార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా మార్పు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీసం మురారి పల్లి వరకు రహదారికి మరమ్మతులు చేయించి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న రహదారి



మాట్లాడుతున్న తహశీల్దార్ వెంకటేశ్వరరావు

జాబ్‌కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-పుల్లలచెరువు

మండలంలోని ఇసుక త్రిపురవరం, గండిబాయి చెంచు గ్రామాలలో ఐటీడీఏ ఆధ్వర్యంలో చెంచు గిరిజన కుటుంబాలకు తహశీల్దార్ కె వెంకటేశ్వరరావు గురువారం ఉపాధి హామీ జాబ్ కార్డ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సార్డ్స్ సంస్థ ప్రతినిధి పులిచర్ల గురవయ్య అధ్యక్షత వహించి మాట్లాడుతూ 86 జాబ్‌కార్డ్‌లను పంపిణీ చేసినట్లు తెలిపారు. తహశీల్దార్ కె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చెంచు గిరిజనులు జాబ్‌కార్డులను ఉపయోగించుకొని 150 రోజుల ఉపాధి పనులు పొందవచ్చన్నారు. ఉపాధిలో స్త్రీ పురుషులకు సమాన వేతనం ఉంటుందని తెలియజేశారు. జాబ్ కార్డ్‌లను కూలీల వద్దనే ఉంచుకోవాలని తెలిపారు. పని జరిగిన రోజున ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించి ఎప్పటికప్పుడు హాజరును వేయించుకోవాలని తెలిపారు.

'ఎన్‌ఫోర్స్‌మెంట్' ముమ్మర దాడులు

- ఐదుగురు అరెస్ట్
- 1600 గ్రాముల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జిల్లాలో గంజాయి అక్రమ రవాణా సాగును అడ్డుకునే లక్ష్యంతో ఎక్సైజ్ శాఖ తన కఠిన చర్యలను ముమ్మరం చేసింది. ఒంగోలు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కె విజయ ఆదేశాల మేరకు యర్రగొండపాలెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గురువారం రెండు విడతలుగా నిర్వహించిన సుదీర్ఘ దాడుల్లో గంజాయి స్వాధీనం చేసుకొని ఐదుగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ శ్రీనివాసులు, ఒంగోలు ఎన్‌ఫోర్సుమెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ పి రాజేంద్రప్రసాద్, సిబ్బంది సమర్థంగా పర్యవేక్షణ చేసి ముద్దాయిలను పట్టుకొని వారి వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రెండు కేసులు నమోదు చేశారు. పుల్లలచెరువు మండలంలోని అయ్యగానిపల్లె గ్రామంలో ఎక్సైజ్ అధికారుల బందం ఆకస్మిక దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో ఈపూరి గురవయ్య వద్ద నుంచి 150 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అంతే కాక అదే



ముద్దాయిలను అరెస్టు చేసిన దృశ్యం

గ్రామంలోని ఓ మిర్చి పొలంలో అక్రమంగా సాగుచేస్తున్న ఐదు గంజాయి మొక్కలను గుర్తించి స్వాదీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో పోలుబోయిన చిన్న సుబ్బారావు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని తగిన ఆధారాలతో కేసు నమోదు చేశారు. అలాగే త్రిపురాంతకం మండలంలోని మేడపి గ్రామంలో మరో దాడిలో ముగ్గురు గంజాయి రవాణాదారులను అరెస్టు చేశారు. వారి వద్ద మొత్తం 1 కిలో 450 గ్రాముల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, ఏడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మల్లెపోగు సాగర్‌బాబు వద్ద 750 గ్రాములు, మాట చిన్న చెంచయ్య వద్ద 350 గ్రాములు, యద్దనపూడి ఐజక్ వద్ద 350 గ్రాములు స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా గంజాయి పంపిణీకి ఉపయోగపడే వాహనాలు, కమ్యూనికేషన్ పరికరాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సిఐ సిహెచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ దాడులలో ఒంగోలు ఎన్‌ఫోర్సుమెంట్ విభాగం సిబ్బంది, యర్రగొండపాలెం ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది సమిష్టిగా పనిచేశారు. గంజాయి సాగు, నిల్వ, రవాణాపై పూర్తిస్థాయి నిఘా కొనసాగుతుందన్నారు. ఈ దందాలో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఎవరైనా గంజాయి లేదా మద్యం అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందిస్తే, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

ఫ్లోరిన్ బాధితులకు పునరావాస పరికరాల పంపిణీ

ప్రజాశక్తి-పొదిలి

మండలంలోని ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అర్బన్ పిహెచ్‌సి పరిధిలోని రాజుపాలెం గ్రామంలో గతంలో ఫ్లోరోసిస్ బాధితులకు పునరావాస పరికరాలను అందజేశారు. దీనిపై గురువారం రాజు పాలెం హ్యాబిటేషన్ పరిధిలో ఫ్లోరోసిస్ బాధితులకు అందజేసిన పరికరాలను జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ వేము అనిల్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-2025 స్కూల్ సర్వే కమ్యూనిటీ సర్వేను నిర్వహించామన్నారు. ఈ సర్వేలో భాగంగా ఫ్లోరిసిస్ బాధితులైన వారికి 24 వీల్ చైర్స్, 22 వాకర్సు, 21 వాకింగ్ స్టిక్స్, 18 వెస్టన్ కమోడిటీలను అందజేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వాటిని పరిశీలించారు. కొత్త పరికరాలు కూడా వస్తాయని అవసరమైతే వాటిని కూడా ఫ్లోరోసిస్ బాధితులకు అందిస్తామని తెలిపారు. ముఖ్యంగా ఫ్లోరిన్ బాధితులు పరిశుభ్రమైన తాగునీరు, ఆహార నియమాలను కచ్చితంగా పాటించాలన్నారు. అనంతరం ఫ్లోరోసిస్ బాధితులకు విటమిన్ సి, ఇతర విటమిన్ టాబ్లెట్స్‌ను అందజేశారు. అనంతరం ఏఎన్ఎం, ఆశలకు హెల్త్‌ఎడ్యుకేషన్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పలపాడు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం సుగుణ కుమార్, అర్బన్ పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ శరతచంద్ర పాల్గొన్నారు.



పునరావాస పరికరాలను పంపిణీ చేస్తున్న వైద్యులు

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి-పర్చూరు

మండల కేంద్రమైన పర్చూరులోని నెహ్రూ కాలనీలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించి పూరిల్లు దగ్ధమైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఇంట్లో వెండి, బంగారు వస్తువులు, డబ్బులు, బట్టలు కాలిపోవడంతో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. ఈ అగ్ని ప్రమాదంలో కాలనీకి చెందిన నల్లమోతు రాజా పూరిల్లు దగ్ధమైంది. కూలి పనులు చేసుకుని దాచిపెట్టుకున్న డబ్బు కూడా తగలబడింది. అగ్ని ప్రమాద సంఘటన తెలుసుకున్న స్థానిక ఎస్ఐ మాల్యాద్రి, రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని అగ్ని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుల నుంచి వివరాలు సేకరించారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ అగ్నిప్రమాదం చోటు చేసుకుందని బాధితులు అధికారులకు వివరించారు. చుట్టుపక్కల వారు వచ్చి మంటలను ఆర్పారు. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు లక్షన్నరకు పైగా ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు రాజా అధికారులకు వివరించాడు. కూలి పనులు చేసుకుని దాచుకున్న నగదు మంటలలో కాలిపోయి ఉండడాన్ని చూసి లబోదిబోమన్నారు. కట్టుబట్టలతో మిగిలిన తమను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితులు కోరారు.



ప్రమాదంలో కాలిపోయిన నోట్లు

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

లక్ష రూపాయల జరిమానా

ప్రజాశక్తి-గిద్దలూరు

చెల్లని చెక్కు కేసులో నిందితుడికి గిద్దలూరు కోర్టు ఏడాది జైలుశిక్ష, రూ.లక్ష జరిమానా విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి. జె పంగులూరు మండలానికి చెందిన ఎన్ఎన్ స్మార్ట్ టెక్నాలజీస్ ప్రొప్రయిటర్ నాలి నాగార్జున, కంభం గ్రామంలోని బెస్తవీధికి చెందిన సొరకొండ శ్రీనివాసులు అను వ్యక్తి నుంచి రూ.లక్ష అప్పుగా తీసుకొని, అప్పును తిరిగి చెల్లించేందుకుగాను రూ.లక్షకు చెక్కు ఇచ్చాడు. సదరు సొరకొండ శ్రీనివాసులు చెక్కును బ్యాంకులో వేయగా, చెక్ బౌన్స్ అయ్యింది. ఈ కేసు సుదీర్ఘకాలం ఏడు సంవత్సరాలపాటు విచారణ జరిగింది. ఈ మధ్య కొత్తగా విధుల్లో చేరిన గిద్దలూరు అడిషనల్ జ్యుడీషియల్ ఫస్టుక్లాసు న్యాయమూర్తి కె భరత్‌చంద్ర నిందితుడికి ఒక సంవత్సరం జైలు శిక్ష, ఒక లక్ష రూపాయల పరిహారం విధిస్తూ గురువారం తీర్పుచెప్పారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కురిచేడు

రైలు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. వివరాల్లోకెళ్తే కురిచేడు పంచాయతీలోని కాటంవారిపల్లె గ్రామానికి చెందిన సంఘ రమణారెడ్డి(55) పొలం పనుల నిమిత్తం గురువారం తెల్లవారుజామున రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తూ ఆ సమయంలో రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నరసరావుపేట రైల్వే పోలీసులు రైల్వే ఎస్ఐ ఎస్ శ్రీనివాస్‌నాయక్ తన సిబ్బందితో వచ్చి జరిగిన సంఘటన పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



రమణారెడ్డి (ఫైల్)

అడుసుమల్లిలో చోరీ

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు మండలం అడుసుమల్లిలో బుధవారం రాత్రి రేగులగడ్డ ఆనందరావు ఇంటిలో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దొంగలు బీరువా పగులగొట్టి 15 వేల రూపాయల నగదును దొంగలించుకుని వెళ్లినారు. పర్చూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చి రిపోర్టు ఇవ్వగా పరుచూరి ఎస్ఐ మాల్యాద్రి సదరు దొంగతనంపై కేసు రిజిస్టర్ చేసి ఆ ప్రాంతాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో అయిదుగురికి జరిమానా

ప్రజాశక్తి-మార్కాపురం

మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో అయిదుగురికి కోర్టు శిక్ష విధించింది. ఐదుగురిలో నలుగురికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున, మరొకరికి రూ.5 వేలు జరిమానా విధిస్తూ మార్కాపురం జూనియర్ సివిల్ జడ్జి ఎం బాలాజీ గురువారం తీర్పునిచ్చారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కంభం రూరల్

స్టేట్ చైల్డ్ లైఫ్ కమిషన్ మెంబర్ బి పద్మావతి గురువారం కంభం పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాలను, సచివాలయాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లలో చదువుకున్న చిన్నారులు ప్రభుత్వ బడులలో చేరే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ కళాశాలలో ఎంతమంది చేరుతున్నారనే నివేదికలు తయారు చేయాలని, బాల్యవివాహాలు అరికట్టేందుకు, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు కృషి చేయాలని అన్నారు. ఇందుకుగాను గ్రామ పంచాయతీ సర్పంచ్, సిబ్బంది సహకారం తీసుకోవాలని తెలిపారు. కొనకనమిట్ల, పొదిలి మండలాలలో అంగన్‌వాడీ సెంటర్లను మూసివేయడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై తాను ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఏ కిరణ్, విజయలక్ష్మి, సర్పంచ్ బోడయ్య, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, బి పేట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఇన్‌ఛార్జి సిడిపిఓ నీలోఫర్, సూపర్‌వైజర్ వి చెంచులక్ష్మి గ్రామపంచాయతీ, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పన్నుల చెల్లింపు కేంద్రానికి అడ్డుగా కమిషనర్ కారు

ప్రజాశక్తి-గిద్దలూరు

గిద్దలూరు నగర పంచాయతీ కార్యాలయం ఆవరణలోని పన్నులు చెల్లింపు కేంద్రం వద్ద ప్రజలు వేచి ఉండు షెడ్డులో గురువారం నగర పంచాయతీ కమిషనర్ కారు పార్క్ చేశారు. కార్యాలయానికి వివిధ పనులపై వచ్చే ప్రజలు ఎండలో, కార్యాలయంలోని చెట్ల కింద వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు పట్టణ వాసులు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా నగర పంచాయతీ కమిషనర్ ప్రజల వేచి ఉండే షెడ్డులో కాకుండా ఇతర ప్రదేశంలో పార్కింగ్ చేయాలని పలువురు పట్టణ ప్రజలు కోరుతున్నారు.



పన్నుల చెల్లింపు కేంద్రం ముందు కమిషనర్ కారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-అద్దంకి

రోడ్డు దాటుతున్న సమయంలో లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గోపాలపురం గ్రామానికి చెందిన కె అంజయ్య వ్యక్తిగత పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొంది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. స్థానిక పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తీవ్రం గాయాలపాలైన కోసాల అంజయ్య

పాలిసెట్ ఫలితాల్లో 'ఇన్‌స్పైర్' ప్రభంజనం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

విడుదలైన ఏపి పాలిసెట్ ఫలితా ల్లో పెద్దదోర్నాలలోని ఇన్‌స్పైర్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు షేక్ బషీర్ 120 మార్కులకు గాను 115 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 436వ ర్యాంకు సాధించాడు. అలాగే షేక్ మాజ్ 120 మార్కులకు గాను 113 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 887వ ర్యాంకు సాధించారని కోచింగ్ సెంటర్ డైరెక్టర్ డి సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు సతీష్, శ్రీనివాసరావు, సురేష్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

కుటుంబ 'సంఘీభావ విరాళం' పంపిణీ

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలం వెంకటాపురం మండల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయునిగా పనిచేస్తూ ఇటీవల గుండెపోటుతో మరణించిన పాలుగుళ్ల కిరణ్ కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులకు యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ పథక సంఘీభావ విరాళం రూ.2 లక్షలు అందజేశారు. గిద్దలూరు మండలం కొత్తపల్లి గ్రామంలో గురువారం కిరణ్ కుమార్‌రెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ సభలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ గిద్దలూరు మండల అధ్యక్షులు డాక్టర్ మొర్రి పిచ్చయ్య, కిరణ్ కుమార్ రెడ్డి సతీమణికి 2 లక్షల రూపాయల చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ గిద్దలూరు మండల శాఖ ఉపాధ్యాయులు, కిరణ్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



చెక్‌ను అందజేస్తున్న పిచ్చయ్య



మాట్లాడుతున్న జేవీవీ నాయకులు కోదాటి కోటేశ్వరరావు

మానసికాభివృద్ధితో చదువులో రాణింపు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మానసికంగా, శారీరకంగా అభివృద్ధి చెందితే చదువులో రాణిస్తారని జేవీవీ జిల్లా నాయకుడు కోదాటి కోటేశ్వరరావు అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఐద్వా జేవీవీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకాశం బాలోత్సవ కార్యక్రమం ఏడో రోజున జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు కోదాటి కోటేశ్వర రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కొన్ని దేశభక్తి గేయాలు, నీతి కథల గురించి వివరించారు. మూఢనమ్మకాల వలన వచ్చే నష్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి మాలతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం ఆర్‌టిసి డిపోలో కొందరు ఆదర్శ ఉద్యోగులుగా నిలుస్తున్నారని, అలాంటి వారిని ఇతర ఉద్యోగులు స్ఫూర్తిగా తీసుకోవాలని మార్కాపురం డిపో మేనేజర్ ఎఎస్ నరసింహులు అన్నారు. ఏప్రిల్ నెలకు సంబంధించిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ స్థానిక డిపో ఆవరణలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా డిపో మేనేజర్ నరసింహులు మాట్లాడారు. అత్యధిక ఇపికె సాధించిన కండక్టర్లు షేక్ బాషాహుస్సేన్, బి సుబ్రమణ్యం, ఎ రామిరెడ్డి, అత్యధిక కెఎంపిఎల్ సాధించిన డ్రైవర్లు విబి కాశయ్య 7.44 కెఎంపిఎల్‌తో మొదటి స్థానంలో, ఎంబి కాశయ్య 6.96 కెఎంపిఎల్‌తో రెండో స్థానంలో నిలిచారు. ప్రొడక్ట్ వైజ్ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులు ఎం శ్రీనివాసులు (డ్రైవర్, సూపర్ లగ్జరీ), జి మూర్తెయ్య (కండక్టర్, ఎక్స్‌ప్రెస్), ఎస్‌కెఎన్ అహమ్మద్ (కండక్టర్, పల్లెవెలుగు)లు అంకిత భావంతో విధులు నిర్వహించారు. వీరందరినీ నగదు అవార్డులతో డిపో మేనేజర్ నరసింహులు సత్కరించారు.



శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి

మహిళల అభివృద్ధే దేశాభివృద్ధి

ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మహిళల అభివృద్ధే దేశ అభివృద్ధి అని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి అన్నారు. జనశిక్షణా సంస్థ వారి ఆధ్వర్యంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) వారి సౌజన్యంతో సంతనూతలపాడు గ్రామంలోని సుందరయ్య భవనం నందు తొంబై రోజులు డ్రసెస్ మేకింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆధునిక సమాజంలో మహిళలు ఏదో ఒక వత్తి శిక్షణ పొంది వారి నైపుణ్యాలను పెంపొందించుకోవడం అవసరం అని అన్నారు. మహిళలు ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా అబివద్ధి చెందాలని అన్నారు . ఈ కుట్టు శిక్షణా కేంద్రాన్ని మహిళలు అందరూ ఉపయోగించుకోవాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి కే పెద్దబ్బాయి మాట్లాడుతూ సుందరయ్య భవన్ ప్రజా సమస్యల పరిష్కారం కేంద్రంగానే కాక ప్రజలకు సేవా కార్యక్రమాలకు కూడా వినియోగించుకోవడానికి , ముఖ్యంగా సమాజంలో సగభాగంగా ఉంటున్నటువంటి మహిళలకు ఈ కుటుంబ శిక్షణా కేంద్రం ఈ ఆఫీస్ ద్వారా నిర్వహించడం చాలా సంతోషదాయకమని అన్నారు. ఈ కార్యక్రమానికి మండల కార్యదర్శి నెరుసుల మాలతి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమం ఐద్వా ,జనశిక్షణా సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న కుట్టు శిక్షణా కేంద్రాన్ని మహిళలందరూ తమ అభివద్ధికి ఉపయోగించుకోవాలని క్రమశిక్షణగా దీనిని నేర్చుకోవాలని మాలతి కోరారు. కార్యక్రమంలో జన శిక్షణ సంస్థ ప్రోగ్రాం ఆఫీసర్ కె శ్యాంమ్ సునీల్ , వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు ,ఐద్వా నాయకులు కే బుజ్జి ,టైలరింగ్ టీచర్ అనురాధ పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధే లక్ష్యం

గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

కంభం, గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధే తన లక్ష్యమని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. గిద్దలూరు ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో గురువారం నియోజకవర్గంలోని ఆరు మండలాల ప్రభుత్వ వైద్య అధికారులు వైద్య సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో మొదటగా ఓపి, మందులు ఇచ్చు గదులు, వాటర్ ప్లాంట్‌లను ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. గిద్దలూరు ప్రాంతీయ వైద్యశాల అభివృద్ధికి ప్రభుత్వ నిధులతో పాటు అవసర మైతే తన సొంత నిధులు వెచ్చిస్తానని తెలి పారు. ఈ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే గిద్దలూరు కంభం ప్రభుత్వ వైద్యాధికారులతో పాటు నియోజకవర్గంలోని అన్ని పీహెచ్‌సీల డాక్టర్ల ద్వారా అక్కడ జరుగుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. గిద్దలూరు ప్రాంత ప్రభుత్వ వైద్యశాలలను కార్పొరేట్ హాస్పిటళ్లకు ధీటుగా మెరుగైన వైద్యం అందేలా తీర్చిదిద్దాలని ఆయన డాక్టర్లకు సూచించారు. మూడు కోట్ల రూపాయల ప్రభుత్వ నిధులతో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలలో ఎక్విప్‌మెంట్ వైద్య యంత్రాలు, పరికరాలు మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు బాగున్నాయని, వైద్యులు ఇంకా మెరుగైన సేవలందించి రోగులకు వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రుల్లో ఓపీ శాతం పెరగాలని డాక్టర్లను ఆదేశించారు. డాక్టర్లు రోగులతో బంధుమిత్ర శ్రేయోభిలాషిగా ప్రవర్తించి వైద్యం అందించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందుతుందన్న నమ్మకం ప్రజలందరిలో కలిగేలా మెలగాలన్నారు. వైద్యులు డ్యూటీ టైంలో తప్పక రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని, 104, 108 సర్వీసు సేవలను వేగవంతం చేయాలని కోరారు. గిద్దలూరు, కంభం ప్రాంతీయ వైద్యశాలల్లో గుండెపోటుకు సంబంధించిన ఇంజక్షన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. మారుమూల గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి వారికి వైద్యసేవలు అందిద్దామని ఆయన డాక్టర్లను కోరారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు ప్రాంతీయ వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ ఎస్కె ఆదాము, అడ్మినిస్ట్రేటర్ రమణారెడ్డి, మార్కాపూర్ డిప్యూటీ డిఎంఅండ్ హెచ్ఓ రాహుల్, అన్ని పీహెచ్‌సీల డాక్టర్లు, గిద్దలూరు నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, గిద్దలూరు, కంభం ఏఎంసీ చైర్మన్లు పునూరి భూపాల్‌రెడ్డి, బైలడుగు బాలయ్య, గిద్దలూరు కో-ఆపరేటివ్ సొసైటీ చైర్ పర్సన్ దుత్తా బాలేశ్వరయ్య, రాచర్ల ఎంపీడీఓ సూరే వెంకటరామిరెడ్డి, గిద్దలూరు డిప్యూటీ తహశీల్దార్ అక్తర్ నాయబ్ హుస్సేన్ పాల్గొన్నారు.



ఉపాధి పనులు తనిఖీ చేస్తున్న కూలీలు

వలసలు నివారణకే 'ఉపాధి'

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రభుత్వం వలసలు నివారించేందుకు ఉపాధి హామీ పనులను ఏర్పాటు చేసిందని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి ఏపీవో ఎం శైలజ అన్నారు. గురువారం యర్రగొండపాలెం మండలంలోని బోయలపల్లి పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆమె ప్రత్యక్షంగా సందర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిని కల్పిస్తూ, జీవనోపాధికి తోడ్పడే ఈ పథకం పనుల పురోగతిని ఆమె నిశితంగా పరిశీలించారు. ప్రత్యేకంగా త్రవ్వక పనుల్లో ఉన్న ఫారం పాండ్ నిర్మాణంపై దృష్టి సారించి, పని ప్రగతిని అడుగడుగునా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పనిని నాణ్యతా ప్రమాణాలతో పాటు సమయపాలనతో పూర్తి చేయాలన్నారు. "ప్రభుత్వం ఉపాధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ప్రతి గ్రామంలో పనుల నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈ పనులను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ నీళ్ల బాటిల్‌ను వారి వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఆమె వెంట ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదంలో చెరువు కట్ట

- దిగువ ప్రాంత ప్రజల గుండెల్లో రైళ్లు
- రాజుపాలెం దశబంధం చెరువు లోపల, కట్టపైనా చిల్లచెట్ల వనం

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు మండలం రాజుపాలెం దశ బంధం చెరువు కట్ట భారీ ప్రమాదంలో ఉంది. ఈ చెరువుకట్ట ఇరువైపులా చిల్లచెట్లతో నిండిపోయింది. దీంతో చెరువుకట్ట బలహీనంగా మారింది. రానున్న వర్షాకాలంలో చెరువుకట్ట దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ 130 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు నుంచి ప్రమాదం పొంచి ఉండడంతో చెరువుకట్ట దిగువ ప్రాంత గ్రామాల ప్రజలు ఆందోళనలో ఉన్నారు. చెరువుకు గండిపడితే దిగువ గ్రామాలైన రాజుపాలెం, రౌతుపల్లె, ముక్తాపురం, ఎన్నంపల్లె తదితర గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం లేకపోలేదు. రాబోయే వర్షాకాలం నాటికి చెరువు కట్టకు ఇరువైపులా ఉన్న చిల్లచెట్లను తొలగించాలని పలువురు కోరుతున్నారు. చెరువు అంతర్భాగంలో ఉన్న చిల్లచెట్లను తొలగించి పూడికతీత పనులు చేపట్టినట్లయితే మూగజీవాలైన గొర్రెలు, మేకలు, పశువులు వంటి వాటికి తగినంత నీటిని నిల్వ చేసుకోవచ్చని అంటున్నారు. అధికారులు ఈ దశబంధం చెరువును పరిగణలోకి తీసుకొని పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. పనులు చేపట్టకపోతే ఈ ప్రాంతంలో అనేక గ్రామాలు ముంపునకు గురయ్యి మూగజీవాలకు, పశు పోషకులకు తీవ్ర నష్టం జరుగుతుందనే



చెరువులో పెరిగిన చిల్లచెట్లు



చెరువు కట్టకు ఇరువైపులా పెరిగిన చిల్లచెట్లు



రాజుపాలెం దశబంధం చెరువు

ఆందోళన వ్యక్తమవుతోంది. అధికారులు వెంటనే చొరవ చూపి చెరువు కట్టమీద, చెరువు లోపల ఉన్న చిల్లచెట్లను తొలగించి చెరువును కాపాడేలా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

చిల్లచెట్లు తొలగించాలి

జొన్నలగడ్డ పాండు, దశబంధం చెరువు నీటి సంఘం మాజీ అధ్యక్షుడు



నేను నీటి సంఘం అధ్యక్షులుగా ఉన్నప్పుడు చెరువులో చిల్లచెట్లను తొలగించి, పూడిక తీసి చెరువును అభివృద్ధి చేశాను. తద్వారా 2004 నుంచి ప్రస్తుతం 2025 వరకు కూడా చెరువులో నీటి నిల్వలు ఉన్నాయి. ఈ 20 సంవత్సరాల కాలంలో చెరువులోకి మట్టి దొర్లి దాదాపు 20 అడుగుల లోతు పూడిపోయింది. జాతీయ ఉపాధి హామీ చట్టం ద్వారా చెరువు పూడికతీత పనులు చేపట్టాలి. చెరువు లోపల, చెరువు కట్టపైన ఉన్న చిల్లచెట్లను తొలగించాలి.

అధికారులు స్పందించాలి

షేక్ ఖాజావలి, రైతు



దశ బంధం చెరువుకు ఇరువైపుల నుంచి అధిక మొత్తంలో నీరు చేరుతోంది. ఈ చెరువుకు అనేక వాగుల నుంచి నీరు దొర్లి ఆ నీరంతా ఈ చెరువులోనే నిల్వ అవుతోంది. అందు వలన ఈ ప్రాంత ప్రజలకు, పశు పోషకులకు ఈ చెరువు ఎంతో ఉపయోగకరంగా ఉంటోంది. రాబోయే వర్షాకాలం నాటికి చిల్లచెట్లను తొలగించాలి. లేకుంటే రాజుపాలెం, రౌతుపల్లె, ముక్తాపురం, ఎన్నంపల్లె తదితర గ్రామాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి ప్రజలను ఈ ప్రమాదం నుంచి కాపాడాలి.

సమ్మెకు మద్దతుగా

గ్రామీణ ప్రాంతాల్లో నిరసన

వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు




కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని, సమ్మెకు మద్దతుగా గ్రామీణ ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక నిర్ణయించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నెరుసుల వెంకటేశ్వర్లు, కంకణాల ఆంజనేయులు తెలియజేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికవర్గం త్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలు, హక్కులను మోడీ ప్రభుత్వం బలహీనపరిచి 'నాలుగు కోడ్' లుగా మార్చిందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రకతి వనరులను విదేశీ స్వదేశీ కార్పోరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తామన్న మాట మార్చారని, ధరల తగ్గింపు లేకపోగా నిత్యవసర వస్తువుల ధరలు నింగినంటుతున్నాయని విమర్శించారు. పండించిన పంటలకు కనీస మద్దతు ధరలు చట్టం తెస్తామని చెప్పి వ్యవసాయాన్ని కార్పొరేట్ పరం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆహార భద్రత చట్టాన్ని నీరుగార్చి ప్రజా పంపిణీని పలుచన చేస్తున్నారని విమర్శించారు. వామపక్షాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు చేసిన పోరాటాల ఫలితంగా వచ్చిన ఉపాధి హామీ చట్టానికి మోడీ ప్రభుత్వం క్రమంగా నిధులు తగ్గించి.. నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. కేంద్ర బడ్జెట్లో ఏడాదికి రూ.రెండు లక్షల 50 వేల కోట్లు ఉపాధి హామీకి కేటాయించడం ద్వారానే దేశం ఆర్థిక సంక్షోభం నుండి బయటపడుతుందని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం ఈ బడ్జెట్ లో కేవలం రూ.69 వేల కోట్లు మాత్రమే ఉపాధికి కేటాయించిందని, ఆ చట్టాన్ని క్రమంగా నిర్వీర్యం చేసే చర్యలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మే 20వ తేదీ నాడు సార్వత్రిక సమ్మె, దానికి మద్దతుగా గ్రామీణ ప్రాంతాల్లో జరిగే నిరసన కార్యక్రమాలు మోడీ ప్రభుత్వానికి ఒక హెచ్చరికలా ఉంటాయని హెచ్చరించారు. సమ్మెకు మద్దతుగా జరిగే నిరసన కార్యక్రమాల్లో వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కంకణాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆర్థిక సంఘం నిధులివ్వాలని వినతి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్



అర్జీ ఇస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు నగర అభివృద్ధికి 16వ ఆర్థిక సంఘం నిధులు అధిక మొత్తంలో కేటాయించి సహకరించాలని నగర మేయర్ గంగాడ సుజాత 16వ ఆర్థిక సంఘం సభ్యులు డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్ కి విన్నవించారు. 16వ ఆర్థిక సంఘం సమావేశం గురువారం తిరుపతిలోని ఒక ప్రైవేటు హోటల్లో సౌమ్య కాంతి ఘోష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత హాజరయ్యారు. ఒంగోలు నగరంలో మౌలిక వసతుల కల్పనకు 16 వ ఆర్థిక సంఘం ద్వారా అధిక మొత్తంలో నిధులు కేటాయించాలని కోరారు. నగరంలో ఉన్న ప్రజా అవసరాలను వివరిస్తూ ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ రాష్ట్రస్థాయి ఉన్నత అధికారులు, రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు సంబంధించిన మేయర్లు, చైర్మన్లు పాల్గొన్నారు.

వేమూరులో 'స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర'

కలెక్టర్ జె.వెంకట మురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని వేమూరు నియోజకవర్గంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల 3వ శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం ఈ నెల 17వ తేదీన " వేడిని తట్టుకోవటం" అనే అంశంపై వేమూరులో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి వేమూరు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బాపట్ల జిల్లా ప్రత్యేక అధికారి కతిక శుక్ల పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయవలసిందిగా జిల్లా అధికారులకు విధులు కేటాయించడమైనదని తెలిపారు. అధికారులు వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించి, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నేడు మాల కార్పొరేషన్ చైర్మన్ ప్రత్యేక కార్యక్రమం

ప్రజాశక్తి-ఒంగోలు

ఒంగోలు భాగ్యనగర్ 11వ అడ్డరోడ్డులోని డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ సెంటర్‌లో మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్ జిల్లాలోని మాల పెద్దలు, సంఘాల నాయకులతో ప్రత్యేక చర్చా కార్యక్రమం శుక్రవారం జరుగుతుందని ఎస్‌సి కార్పొరేషన్ ఈడీ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ఛైర్మన్ వివిధ అంశాలపై ప్రత్యేక చర్చా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని మాల సామాజిక వర్గానికి చెందిన పెద్దలు, మాల సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఒప్పంద జీవోల అమలు కోసం

సమ్మెలో భాగస్వాములు కావాలి

- ఆశాల నియామకం ప్రభుత్వమే చేపట్టాలి
- జాబ్ చార్ట్ రూపొందించాలి
- ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా సదస్సులో వక్తలు



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రెండు దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతాల్లో నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా 'మాతా శిశు సంరక్షణ' సేవలు అందిస్తున్న ఆశా వర్కర్ల సమస్యలపై ప్రభుత్వ ఒప్పందం ప్రకారం జీవోలు అమలుచేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. గురువారం నాడు స్థానిక కాపు కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా సదస్సు నిర్వహించారు. ఆందోళన ఫలితంగా సాధించుకున్న ఒప్పంద జిఒల అమలుకు మే 20న జాతీయ సమ్మెలో భాగస్వాములు కావాలని సదస్సు పిలుపునిచ్చింది. సదస్సులో ముఖ్య అతిథిగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో ఇరవై ఏళ్ల క్రితం కేవలం యాభై, వంద రూపాయల ఇన్సెంటివ్ కోసం నియమితులైన 'ఆశా వర్కర్ల' సేవలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించకున్నను 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' గుర్తించిందన్నారు. కోవిడ్ కాలంలో 'సామాజిక బాధ్యత'గా వీరు అందించిన సేవలను ప్రజలు ప్రశంసించారని గుర్తు చేశారు. జీతాలు లేని తొలినాళ్లలో సైతం వీరి సేవల వల్ల మాతృశిశు మరణాలు తగ్గాయని, కుటుంబ నియంత్రణ సమగ్రంగా అమలయ్యిందని 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' ప్రకటించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత ఇరవై ఏళ్లుగా ఆశాలు ఎన్‌హెచ్‌ఎం విభాగంలో ఆరోగ్య సేవలు అందిస్తున్నారని, ప్రతి కాన్పు ఆసుపత్రిలో జరిగేలా సేవలందిస్తున్నట్లు విశ్లేషించారు. ఆశాల జీతాల కోసం 2007లో యూనియన్ ఏర్పడిన నాటి నుంచి ఉద్యమం చేపట్టిన ఫలితంగా చంద్రబాబు ప్రభుత్వం రూ.3 వేలు అనంతరం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రూ.10 వేలు గౌరవ వేతనం దక్కినట్లు గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆశాల ఉద్యమం అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో ఆశాల సమస్యలపై ఐక్య పోరాటాలు చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఆశావర్కర్ మరణించినా, రిటైర్ అయినా ఎటువంటి ఆర్థిక సహాయం అందటం లేదన్నారు. ఆశాలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని ఈఎస్ఐ, పిఎఫ్ వంటి సదుపాయాలు కల్పించాలని, నిర్దిష్టమైన జాబ్ చార్ట్ రూపొందించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఆశా వర్కర్లు మే 20న సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు హక్కుల సాధన కోసం చేపట్టే ఉద్యమాలకు అధికారుల అనుమతి అవసరం లేదని ఆశాలకు సూచించారు. ఆధునిక బానిసలుగా చేసే కార్మిక చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి.కొండారెడ్డి మాట్లాడుతూ కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్లను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంట్యాల కల్పన మాట్లాడుతూ ఆశాలు వేతనాల లేకుండా 14 ఏళ్లు పని చేశారని, 14 ఏళ్ల ఉద్యమం ద్వారా వేతనాలతో పాటు ఆశావర్కర్లుగా గుర్తింపు పొందామన్నారు. ఉద్యోగ భద్రత కోసం మరోసారి ఉద్యమం చేపట్టాలని సూచించారు. ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జి.శేషయ్య, ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ 'ఆశా వర్కర్ల' ఉద్యమానికి తాము అండగా నిలుస్తామని ప్రకటించారు. యూనియన్ జిల్లా నాయకురాలు పరిశుద్ధం అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ఆఫీస్ బేరర్లు అరుణ, అనూష, సిఫోరా, విజయ, కోటేశ్వరి, నాగమ్మ, విశ్రాంతమ్మ, సుశీల, బాలమ్మ, అరుంధతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మూడు ప్రాంతాలకు ప్రత్యేక బస్సు సౌకర్యం

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

ఒంగోలు నుంచి జిల్లాలోని కొండపి మండలం గోగినేనివారిపాలెం, బాపట్ల జిల్లా, అద్దంకి మండలం, సింగరకొండ, నెల్లూరు జిల్లా వలేటివారిపాలెం, మాలకొండ క్షేత్రాలకు ప్రతి శనివారం నాడు ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు ఆర్‌టిసి ఒంగోలు డిపో మేనేజర్ ధర్మవరపు శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. గోగినేనివారిపాలెంకు ప్రతి శనివారం నాడు ఉదయం 6.30, సాయంత్రం 6.30, రాత్రి పది గంటలకు నైట్ హాల్ట్ సర్వీస్ గానూ, ఆదివారం ఉదయం 5.45కు మరో సర్వీస్ నడుపుతున్నట్లు పేర్కొన్నారు. కాగా సింగరకొండకు శనివారం ఉదయం 8 గంటలకు, సాయంత్రం 6 గంటలకు రెండు సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. మాలకొండకు ఉదయం 4.30 గంటలకు, మధ్యాహ్నం 12 గంటలకు సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికులు ఈ బస్సు సౌకర్యం ఉపయోగించుకోవాలని సూచించారు.

కుట్టు శిక్షణ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఒంగోలు నగరంలోని 16 వ డివిజన్ బాలాజీ నగర్‌లో బిసి కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాలను ప్రకాశం జిల్లా బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు గురువారం నాడు పరిశీలించారు. కేంద్రంలో వసతులు, శిక్షణకు వినియోగిస్తున్న మెటీరియల్‌ను పరిశీలించారు. రోజువారీ శిక్షణకు హాజరు గురించి వాకబు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పొదుపు సంఘాలలోని

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా కృషి

కలెక్టర్ వెంకటమురళి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పొదుపు సంఘాలలోని 30 వేల కుటుంబాలకు జీవనోపాధులు కల్పించడం, వారి ఆర్థికాభివద్ధికి బాటలు వేయడమే లక్ష్యంగా తగిన కృషి జరగాలని కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. పొదుపు మహిళల జీవనోపాధుల కార్యకలాపాలు, ఆర్థికాభివద్ధి అంశాలపై మేథోమధన కార్యక్రమం బాపట్లలోని సాయిరామ్ గ్రాండ్ కన్వెన్షన్ హాల్‌లో గురువారం జరిగింది. డిఆర్‌డిఏ, మెప్మాలోని క్షేత్రస్థాయి పట్టణ, గ్రామ సంఘాల నాయకులకు మెగా వర్క్‌షాప్ నిర్వహించారు. వివిధ శాఖల ద్వారా అమలయ్యే పథకాలు, రాయితీలపై అవగాహన కల్పిస్తూ ఏర్పాటుచేసిన స్టాల్స్ ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. సీడాప్ ద్వారా నిరుద్యోగ యువతకు నిర్వహిస్తున్న శిక్షణలు, ఉద్యోగ అవకాశాలపై రూపొందించిన గోడ పత్రాలను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే బాపట్ల జిల్లాను ప్రథమంగా నిలిపి ఏపీ గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం, అవార్డు అందుకున్న కలెక్టర్ జె.వెంకటమురళిని ఈ సందర్భంగా అధికారులు, గ్రామ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. పొదుపు మహిళలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను చేయాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బందిపై ఉందని జిల్లా కలెక్టర్ చెప్పారు. వారంతా నికర ఆదాయం సాధించేలా చైతన్యపరచాలని సూచించారు. పేదరికం నుంచి మహిళలను బయటకు తెచ్చేందుకు వివిధ సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం వెచ్చిస్తున్న రూ.కోట్ల నిధులను మహిళలకు చేరువయ్యేలా సహకరించాలన్నారు. అభివద్ధి ఫలాలు పేద కుటుంబాలకు చేర్చాల్సిన బాధ్యత మీపైనే ఉందన్నారు. బాపట్ల జిల్లాలో 33,390 పొదుపు సంఘాలు ఉండగా అందులో నాలుగు లక్షల కుటుంబాలు సభ్యులుగా ఉన్నారన్నారు. అందులో ఈ ఏడాది ముప్పై వేల కుటుంబాల జీవనస్థితిగతులను మార్చడానికి కార్యోన్ముఖులు కావాలని వారిలో స్ఫూర్తినింపారు.

మహిళల ఆర్థికాభివద్ధికి ప్రభుత్వం ఎన్నో అవకాశాలను కల్పిస్తుందని జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ పిడి కె.శ్రీనివాసరావు తెలిపారు. సమావేశంలో జిల్లా మహిళ సమాఖ్య అధ్యక్షురాలు ద్రాక్షావల్లి, సిపిడిసిఎల్ ఎస్సీ ఆంజనేయులు, ఎల్ డి యం శివకష్ణ, మెప్మా పిడి పి.శ్రీహరి, అనుబంధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

20న సమ్మెలో పంచాయతీ కార్మికులు



కార్యదర్శికి సమ్మె నోటీసు అందజేస్తున్న సిఐటియు నాయకులు బాబురావు

ప్రజాశక్తి - వేటపాలెం

ఈనెల 20న దేశవ్యాప్త సమ్మెలో పంచాయతీ కార్మికులు పాల్గొంటున్నట్లు సిఐటియు అధ్యక్షులు ఎన్ బాబురావు తెలిపారు. స్థానిక పంచాయతీ సెక్రెటరీ మోతుకూరి మోహన్ రంగారావుకు పంచాయతీ కార్మికుల తరపున సమ్మె నోటీసు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరిని రెగ్యులర్ చెయ్యాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని అన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చెయ్యాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తున్న విధంగా పంచాయితీ కార్మికులకు రూ.21వేల జీతం చెల్లించాలని అన్నారు. 132, 142, 680 జిఓలను అమలు చెయ్యాలని, అమలు చేయని అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. టెండర్ల విషయంలో 2015, 2023లో హైకోర్టు ఇచ్చిన తీర్పులను అమలు చెయ్యాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు మచ్చ అయ్యప్పరెడ్డి, ఆంజనేయులు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

వేమూరు : కార్మికవర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.21వేలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం ఎఒకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బి అగస్టిన్ మాట్లాడుతూ 132, 142, 680 జీఒలు అమలు చేయాలని, అమలు చేయని అధికారులపై చర్యలు చేపట్టాలని, టెండర్లపై హైకోర్టు తీర్పు అమలు చేయాలనే డిమాండ్ల సాధన కోసం దేశ వ్యాప్తంగా మే 20న జరిగే సమ్మెలో పంచాయతీ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. లేబర్ కోడ్లు అమలు జరిగితే కార్మిక చట్టాలు వర్తించవని, కార్మికులు బానిసత్వంలోకి నెట్ట బడతారని, కనీసం సంఘం పెట్టు కునే హక్కు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయ సూపరిండెంట్ సిహెచ్ అనురాధకు సమ్మె నోటిసు అందజేశారు. కార్యక్రమంలో కె నాగేశ్వరావు, సిహెచ్ యోనోకు, ఎన్ యేసుకిరణ్, పి సురేష్ పాల్గొన్నారు.



ఎఒకు వినతి పత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

ఉత్తమ విద్యార్థినికి బహుమతి

ప్రజాశక్తి - వేటపాలెం

10వ తరగతి పరీక్షా ఫలితాల్లో 600కు 596 మార్కులు సాధించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో సంచలనం సృష్టించి, నియోజకవర్గానికి ఎంతో పేరు రావడానికి కారణమైన పందిళ్ళపల్లి హైస్కూలుకు చెందిన విద్యార్థిని సజ్జా దివ్యశ్రీని శాసన సభ్యులు మద్దులూరి మాలకొండయ్య గురువారం స్వయంగా ఆనుమల్లిపేటలోని ఆమె ఇంటికి వెళ్లి అభినందించారు. స్థానిక తెలుగుదేశం నాయకులు, కార్యకర్తల సమక్షంలో నగదు బహుమతితో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి గర్వకారణంగా నిలిచి, కలెక్టర్ చే సన్మానించబడి, త్వరలో రాష్ట్ర ప్రభుత్వం చేత కూడా ఘనంగా సన్మానించబడబోతున్న దివ్యశ్రీని ఆశీర్వదించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచారని అభినందించారు. పేదింటి ముద్దుబిడ్డ దివ్యశ్రీ తల్లి, దండ్రులకు కలెక్టర్ ద్వారా స్థలం ఇప్పించడంలో తాను శాయిశక్తుల సహాయం చేస్తానని చెప్పారు. సొంత ఇళ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ప్రోత్సాహాన్ని, మంచితనాన్ని అభినందిస్తూ స్థానిక తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు కొండయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పందిళ్ళపల్లి హైస్కూల్ హెచ్‌ఎం మేడపల్లి శేఖరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ ఎస్ జయలక్ష్మి

బాల్య వివాహాలు చేయొద్దు..

ప్రజాశక్తి - పర్చూరు

బాల్య వివాహాలు చేయరాదని, అది చట్టరీత్యా నేరం అవుతుందని ఐసిడిఎస్ ప్రాజెక్టు జాయింట్ డైరెక్టర్ ఎస్ జయలక్ష్మి పేర్కొన్నారు. ఐసీడీఎస్ పర్చూరు ప్రాజెక్టును ఆమె సందర్శించారు. సిడిపిఒ, సూపర్వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కిషోర వికాసం వేసవి క్యాంపులో పాలొ న్నారు. బాల్య వివాహాలు చేయడం వల్ల శారీరక, మానసి కంగా దుష్ప్రభావాలు చూపుతాయని తెలిపారు. కిషోర్ బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. సమాజం పట్ల అవగాహన కలిగి మెలగాలని అన్నారు. కిషోర బాలికలు చదువుపై శ్రద్ధ చూపా లని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు వల్ల చదువుకు ఆటంకం కలిగితే తమ సంస్థ ద్వారా బాలికలను డిగ్రీ వరకు ఉచితంగా చదివిస్తామని చెప్పారు. మధ్యలో చదువు ఆపేసిన బాలికలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. బాలికలు భవిష్యత్తులో స్వతంత్రంగా ఆర్థికంగా ఎదుగుదల కలిగి ఉండాలని అన్నారు. కిషోర బాలికలతో బాల్య వివాహ రహిత ఆంధ్ర ప్రదేశ్ ఉండేలా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సిడిపిఓ జి సుభద్ర, సూపర్వైజర్స్ పి దీపా దేవి, ఎం అన్నపూర్ణ, ఎంఎస్‌కె యోగేశ్వరి పాల్గొన్నారు.

పావులూరులో నేత్రదానం

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని పావులూరుకు చెందిన పులి సుబ్బరామ (50) మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులు ఆమె కళ్ళను దానం చేశారు. భర్త అంజయ్య కుమారుడు రామారావు కుమార్తె శోభారాణి సమక్షంలో గుంటూరు శంకర్ నేత్రవైద్య శాల వైద్యులు వచ్చి ఆమె కళ్ళ కార్నియాను సేకరించారు. కళ్ళ కార్నియా స్వచ్ఛందంగా దానం చేయటానికి వచ్చిన కుటుంబ సభ్యులను రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు, రోటరీ అధ్యక్షులు, కార్యవర్గం అభినందించారు.

ఐలవరం నుండి స్పెయిన్ చేరిన పేల్పాల్ లెటర్స్

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలో ని ఐలవరం జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు పంపిన పెన్‌పాల్ లెటర్స్ స్పెయిన్ దేశ విద్యార్థులకు చేరాయి. ఐలవరం విద్యార్థులు ఇప్పటికే ప్రపంచంలో 60 దేశాలకుపైగా విద్యార్థులు ఉపాధ్యాయులతో స్కైప్ ద్వారా సంభాషిస్తూ వారికి ఇక్కడి భాష సంస్కృతి వంటి అంశాలను వారితో సంభాషిస్తూ ఉంటారు. అదే రీతిలో ఆయా దేశాల సంస్కృతి విధి విధానాలు కూడా ఐలవరం విద్యార్థులకు చేరుతూ ఉంటాయి. ఆంగ్ల ఉపాధ్యాయులు పచ్చారు హరికృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆయా దేశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో సంభాషించటం వలన ఆంగ్లభాష పట్ల పట్టు సాధిస్తున్నారు. ఐలవరం నుండి పంపిన పెన్పా లెటర్లు అక్కడ ఉపాధ్యాయులు సేకరించి విద్యార్థులకు పంపిణీ చేసి భారత జాతీయ పతాకంతో పాటు ఇక్కడ విద్యార్థులు రూపొందించిన పలు రకాల చిత్రలేఖనాలు సంస్కృతిని ప్రతిబింబించే చిత్రాలను పరిశీలించి అక్కడ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేసినట్లు హరికృష్ణ తెలిపారు. ఈ మేరకు లెటర్లు పంపిన విద్యార్థులను తోడ్పాటు అందించిన ఉపాధ్యాయులు హరికృష్ణను పాఠశాల హెచ్‌ఎం మాచర్ల మోహనరావు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.



పెన్ఫాల్ లెటర్స్ చూపుతున్న స్పెయిన్ విద్యార్థులు

పాలిసెట్‌లో ఉత్తమ ర్యాంకు

ప్రజాశక్తి - అద్దంకి

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పాలీసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో విజేత కోచింగ్ సెంటర్ విద్యార్థి, పట్టణంలోని సంజీవనగర్‌కు చెందిన బత్తుల హర్షిత్ రాష్ట్రస్థాయిలో 111 మార్కులతో 1304వ ర్యాంకు సాధించినట్లు విజేత కోచింగ్ సెంటర్ డైరెక్టర్ అంకమ్మరావు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక కోచింగ్ సెంటర్ ఉపాధ్యాయులు అతనిని అభినం దించారు. ఈ ర్యాంకుతో పాటు ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థులు అందురూ అర్హత పొందినట్లు తెలిపారు.



బత్తుల హర్షిత్

'బీట్ ద హీట్' కార్యక్రమంపై అవగాహన

ప్రజాశక్తి - రేపల్లె

స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17న శనివారం జరిగే 'బీట్ ద హీట్' కార్యక్రమం గురించి ఎన్‌జిఒలు, మునిసిపల్, మెప్మా, సచివాలయ సిబ్బందికి మునిసిపల్ కార్యాలయంలో గురువారం అవగాహన కల్పించారు. మునిసిపల్ కమీషనర్ కె సాంబశివరావు మాట్లాడుతూ బిల్డింగ్ల రూఫ్ టాప్‌లలో తోటలు, మొక్కలు పెంచడం ద్వారా ఉష్ణోగ్రతలు తగ్గించి, జీవవైవిధ్యాన్ని పెంపొందించవచ్చని, పక్షులు, జంతువుల కోసం చిన్న చిన్న నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని, హీట్ వేవ్ గురించి పోస్టర్లు, ఆడియో సందేశాల ద్వారా ప్రజలకు తెలియచేయాలని సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ ఎన్‌ఎవి శివ ప్రసాద్, శానిటరి ఇన్స్‌పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ వైవిపివి ప్రసాద్, మునిసిపల్, సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ కె సాంబశివరావు



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వివాహ వేడుకల్లో ఆనందబాబు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల కేంద్రం భట్టిప్రోలుకు చెందిన టిడిపి ఎస్సీ సెల్ నాయకులు జంగం శ్యాంసన్ తమ్ముడి కుమారుడు మానస్ కుమార్, పుష్పలీల వివాహం భట్టిప్రోలు రైలుపేటలోని దిబ్బ మీద పల్లిలో గురువారం జరిగింది. వివాహానికి శాసన సభ్యులు నక్కా ఆనందబాబు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో బిసి సెల్ నియోజక వర్గ అధ్యక్షులు బట్టు మల్లిఖార్జునరావు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కనగాల మధుసూధన ప్రసాద్, జడ్పిటిసి తిరువీధుల ఉదయభాస్కరి, బాలాజీ, టిడిపి గ్రామ అధ్యక్షులు కుక్కల వెంకటేశ్వరరావు, ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి సుందరరావు, ఇబ్రహీంబేగ్ పాల్గొన్నారు.

మట్టి తవ్వకాల భూముల పరిశీలన

ప్రజాశక్తి - నగరం

మండలంలోని సిరిపూడి, పుడివాడ, పెద్దమట్లపూడి, పెద్దపల్లి గ్రామాలను రేపల్లె ఆర్డీఒ రామలక్ష్మి గురువారం సందర్శించారు. భూమి తవ్వకాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం తహశీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో అక్రమ మైనింగ్‌పై పంట పొలాల్లో పది అడుగుల లోతు మట్టి తవ్వకాలు, తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా తహశీల్దారు నాంచారయ్య పర్యవేక్షిస్తూ భవిష్యత్తులో ఎలాంటి అక్రమ గనుల తవ్వకాలు జరగ కూడదని, అలాంటి కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించవద్దని స్పష్టంగా సూచించారు. సంబంధిత శాఖలతో సమన్వయం పాటిస్తూ, తక్షణమే తవ్వకాలు నిలిపివేయాలని ఆదేశాలు ఇచ్చారు.



త్వకాలు పరిశీలిస్తున్న ఆర్డిఒ రామలక్ష్మి

ప్రసన్నాంజనేయ స్వామికి కలశం బహూకరణ

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి మహాకుంభాభిషేకంలో భాగంగా గురువారం స్వామివారి కలశంను దాతలు నల్లమలపు విజయభాస్కరరెడ్డి, శ్రీదేవి దంపతులు సమర్పించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ మదమంచి తిమ్మనాయుడు దంపతులు, కోట శ్రీనివాసకుమార్ దంపతులు, అర్చకులు లక్ష్మీనారాయణ, చుండూ రి మురళి సుధాకరరావు, ఆర్‌ఆర్‌ఎస్ ఆచార్యులు పాల్గొన్నారు.

భక్తుల పాలిట కొంగు బంగారం పాలేటి గంగమ్మ

ప్రజాశక్తి- పిసిపల్లి

పాలేటి గంగమ్మ భక్తుల పాలిట కొంగు బంగారం లా విరాజిల్లుతోంది. తిరునాళ్ల సందర్భంగా గంగమ్మ ఆలయ చరిత్ర గురించి ప్రజాశక్తి ప్రత్యేక కథనం ...

ప్రకాశం జిల్లా పిసిపల్లి మండలంలోని వెంగళపురం సమీపం లోని పాలేటి గంగ తిరునాళ్లను ప్రతి ఏడాది వైశాఖ బహుళ పాఢ్యమి నుంచి పంచమి వరకూ నిర్వహిస్తారు.

చరిత్ర ఆధారంగా కాటమరాజు కథ, గంగమ్మ గుడి 12వ శతాబ్దానికి చెందినగా ఉన్నవి. ఇందులో కాటమరాజు, కాటంరాజు పూర్వీకులు, కాటంరాజుకు నెల్లూరును పాలిస్తున్న నలసిద్ధి రాజుతో యుద్ధం, ఆ యుద్ధంలో విజయం సాధించి చనిపోయిన యాదవ వీరుల చరిత్ర గురించి తెలుస్తుంది. ప్రస్తుతం ఉత్తర ఆంధ్ర ప్రాంతమైన విజయనగరం ప్రాంతంలోని ఎలమంచిలిని వలురాజు పాలించాడు.11వ శతాబ్ధంలో గంగరాజు, గంగమ్మలకు వలు రాజు జన్మించాడు. ఈయన ఎలమంచిలిని రాజధానిగా చేసుకొని పాలన సాగించాడు. వలురాజు భార్య వల్లమ్మ. ఈయనకు మంత్రి పల్లాకొండయ్య. వలు రాజుకు సింహాద్రి రాజు, పెద్దిరాజు, ఎర్ర నూకరాజు, నల నూకరాజు ,పోలు రాజు ,అను ఐదుగురు కుమారులు, కొమరక్క అనే కుమార్తె ఉంది. వీరిలో పెద్ద కుమారుడు సింహాద్రి రాజు.ఈయన భార్య సింహాద్రి సీత. వీరి రాజధాని పంపాద్రి .వీరికి కారియావుల రాజు, చిట్టినూక అనే సంతానం ఉన్నారు.

రెండో కుమారుడు పెద్దిరాజు : ఈయన తన తండ్రి రాజ్యమైన ఎలమంచిని 10 సంవత్సరాలు పాలించాడు.పంపాద్రిని ఏడు సంవత్సరాలు పాలించాడు. పెద్దిరాజుకు కాటమరాజు అనే కుమారుడు, పాపనూక కుమార్తె ఉన్నారు. పెద్దిరాజు ఆర్లవెంట యుద్ధంలో మరణించాడు. పెద్దిరాజు మరణించేటప్పటికీ కాటమరాజు వయస్సు 7 సంవత్సరాలు.

మూడో కుమారుడు ఎరనూకరాజు : ఈయన భార్య ఎరనూక సీత.వీరికి బొట్టావుల రాజు అనే కుమారుడు, నాగమ అనే కుమారై ఉన్నారు.

నాలవ్గ కుమారుడు నలనూక రాజు : ఈయన భార్య పేరు నలనూక సీత. వీరి కుమారుడు పయ్యావుల ఎర్రయ్య. కుమారై పొద్దినూక. పయ్యావుల ఎర్రయ్యకు బెజవాడ బొబ్బిలి అనే బిరుదు కూడా ఉంది.

ఐదో కుమారుడు పోలురాజు : ఈయన భార్య పేరు సిరిదేవి. వీరికి బత్తరన్నడు ,అయితమ రాజు, ముమ్మయ్య అనే కుమారులు. ఆగుమంది అనే కుమార్తె ఉన్నారు. కర్ణాటక సమీపంలోని చెరుకూరు వద్ద ముక్కంటి అనే రాజు పోలురాజును యుద్ధంలో చంపాడు. తండ్రి చనిపోవటంతో కాటమరాజు, పాపనూక కళ్యాణ పట్నంలోని ముదిరాజులు ఇంట పెరిగారు. కళ్యాణ పట్నంలోని కాటమరాజును పాపనూకలను అయితమరాజు చేత ఎలమంచిలి తీసుకువచ్చి యాదవుల గోవుల మందకు, కాటమరాజుకు పట్టాభిషేకం చేసి రాజుగా ప్రకటించారు..అప్పటినుండి కాటంరాజు ఆవులు మందకు రాజుగా వ్యవహరించాడు. సింహాద్రి రాజు కొడుకు కరియావుల రాజు బేతాళుడుని యుద్ధంలో ఓడించాడు. కాకతీయుల రాజులను కూడా ఓడించాడు.

కాటమరాజు సోదరి పాపనూక పుట్టిన ఐదు రోజులకు తండ్రి పెద్దిరాజు ఆర్లవెంట యుద్ధంలో గెలిచి నప్పటికీ గాయాలతో చనిపోయాడు.పాపనూకకు వివాహం కాలేదు. దొనకొండ వద్ద ఉన్న ఏడంతస్తుల ఒంటి స్తంభం మీద పాపనూకను ఉంచాడు. కాటమరాజు ఆవులు మందతో శ్రీశైలం సమీపంలో కష్ణానది ఒడ్డున 12 సంవత్సరాల పాటు ఉన్నాడు. ఆ తర్వాత కష్ణానది ఎండిపోవడం కరువు రావడంతో నెల్లూరును పాలిస్తున్న నలసిద్ధిరాజు రాజ్యానికి వచ్చేందుకు బయలు దేరాడు. మధ్యలో ప్రస్తుతం ప్రకాశం జిల్లా పిసిపల్లి మండలంలో ఉత్తరం వైపునున్న పాలేరు నది వద్దకు గోవుల మంద వచ్చింది. పాలేటి వద్దకు రాగానే కాటమరాజు ఇంటి ఇలవేల్పు అయిన గంగమ్మ కాటమరాజుతో తన గౌరవించాలని చెప్పింది . పాలేరు నదిలోని గంగను దాటి దక్షిణం వైపు వెళ్లాలంటే ఇంటి ఇలవేలుపు అయిన గంగమ్మను పూజించాలని గంగమ్మ స్వయంగా చెప్పినప్పటికీ కాటంరాజు లెక్క చేయలేదని చరిత్రలో ఉంది. ఆ తర్వాత కొంతకాలానికి వరదలు రావడం, ఉత్తరం వైపున ఉన్న గోవులు పాలేరు నది దాటి దక్షిణం వైపుకు వెళ్లలేకపోవడం, మరికొన్నిసార్లు పాలేరులో నీరు లేకుండా ఎండిపోయి, పశువులు మేత లేక సొమ్మసిల్లి పోడిపోయాయి. పరిస్థితిని గమనించిన కాటమరాజు పాలేరు నదిలో గంగమ్మను ప్రతిష్టించి, పూజలు జరిపి అనంతరం దక్షిణ వైపు వెళ్ళాడు. ప్రస్తుతం కూడా పాలేరు నదిలో ఒక శిలపై గంగమ్మ విగ్రహం వుంది.ఈ సందర్భంగా కాటమరాజు గంగమ్మతో ప్రతి సంవత్సరం జాతర నిర్వహిస్తానని చెప్పగా అందుకు గంగమ్మ అంగీకరించినట్లు చరిత్రకారులు తెలిపారు. అందులో భాగంగా ప్రతి సంవత్సరం వైశాఖ బహుళ పాడ్యమి నుంచి పంచమి వరకూ ఐదు రోజులపాటు అంగరంగ వైభవంగా తిరునాళ్ల నిర్వహిస్తున్నారు. కాటంరాజు కథలలో అనేక వీర గాథలు ఉన్నాయి.



పాలేటి గంగమ్మతల్లి



పాలేటి గంగమ్మ ఆలయం

కాటమరాజు పాలేరు వద్ద నుంచి నెల్లూరు సీమకు ,నలసిద్ధి రాజు ప్రాంతానికి వెళ్ళాడు. అక్కడ ఆవులు మేపుకునేందుకు పుల్లరి చెల్లించే ఆమోదంతో పెన్నా నది పరవాహ ప్రాంతానికి వెళ్ళాడు. ఈ ఒప్పందాన్ని జన్నివాడకథ అంటారు. ప్రస్తుతం జన్నివాడను జొన్నవాడ పిలుస్తున్నారు. ఇక్కడ కామాక్షి అనే దేవాలయం ఉంది. కొంతకాలం తర్వాత నల్లసిద్దిరాజు భార్య కుందమామ దేవి పెంపుడు చిలుకలు గోవులు మేస్తున్న ప్రాంతంలో గోవులు బెదిరే విధంగా అరుస్తున్నాయి. చిలుకుల అరుపుకు భయపడిన ఆవులు సక్రమంగా మేయటం లేదు. ఇది గమనించిన కాటంరాజు మంత్రి పద్మరాఘవుడు చిలుకలపై బాణం వేశాడు. గాయపడిన చిలుకలు కుందమాదేవి ఒడిలో పడి మరణించాయి.తన పెంపుడు చిలుకలు మరణించాయని ఆగ్రహం చెందిన కుందమాదేవి తమ భటులతో కాటంరాజు గోవులను హత్య చేయించింది. ఇది మొత్తం జన్నివాడ ప్రాంతంలో జరిగింది. భటులతో గోవులను హత్య చేయించిందని అనే ఉద్దేశంతో కాటంరాజు నల సిద్ధ రాజుకు కప్పం చెల్లించకుండా వెనుతిరిగి వస్తున్నాడు దీంతో నల్లసిద్ధి రాజు గోవులను మేపుకునేందుకు ఒప్పుకున్న ప్రకారం పుల్లరి చెల్లించాలని తన మంత్రి భట్టును కాటం రాజు వద్దకు రాయబారంగా పంపాడు. కాటమరాజు తన మంత్రి కొమార బంగారం అనే బట్టును పిలిపించి మాట్లాడమన్నాడు. రాయ శంగారవలి కాటమరాజు భట్టు కొమార బంగారం తో అనుకున్న ప్రకారం పుల్లరి చెల్లించాలని అడిగాడు.ఇదే సందర్భంలో కాటంరాజు మంత్రి కొమర బంగారం నల సిద్ధరాజు మంత్రి రాయ శంగావళి మధ్య కొంత సంభాషణ చమత్కారంగా జరిగింది. రాయబారం మాత్రం ఫలించలేదు. ఇరు వర్గాలు యుద్ధానికి సిద్ధపడ్డారు. కాటమరాజు నల్ల సిద్ధి రాజుకి మధ్య యుద్ధ వాతావరణం ఏర్పడింది. ఈ సందర్భంగా కాటంరాజు దొనకొండలోని అయితంరాజు వద్దకు పద్మ నాయుడుని రాయబారం పంపారు. ఈ రాయబారంలో పద్మనాభుడు అయితమరాజుతో చేసుకున్న ఒప్పందాన్ని తాటియాకుపై రాయాలన్నారు. అందుకోసం తాటి ఆకులను తీసుకురమ్మని చెప్పాడు. పద్మనాభనికి ఏ తాటాకులు మంచివో తెలియక పోవడంతో కోటపాటి వద్ద ఉన్న తాటి ఆకుల బదులు ఏకంగా తాటి చెట్టుని పెకలించి తీసుకొచ్చాడు. అప్పటినుంచి కోటపాటి తాటి వక్షం అనేది చరిత్రగా నిలిచి పోయింది. కోటపాడు ప్రస్తుతం పాలేరు గంగమ్మకు తూర్పు వైపున పాలేటి రోడ్డున ఉన్న ఓ గ్రామం.



ఎర్రగడ్డ పాడు పోట్లాట..

ఇందులో ఏడు కథల ఉన్నాయి. ఒకటి చల్ల వారి జగడం, రెండు బొల్లావుల జగడం ,మూడు బీర్నీడు జగడం, నాలుగు కరి ఆవుల జగడం , ఐదు బాలరాజు యుద్ధం, ఆరు ఆవుల యుద్ధం ,ఏడు కాటమరాజు యుద్ధం.చరిత్రలో కాటమరాజు యుద్ధం బాగా ప్రఖ్యాతి గాంచినది. ఇందులోనూ గొప్ప చరిత్ర ఉంది.

బొల్లావు జగడం ..

నేటికీ యాదవులు తమ శుభకార్యాలలో ఉత్సవం జరుపుతారు. కాటమరాజు తరపున ఒంటి కొమ్ము ఉన్న బొల్లావు, నలసిద్ధి రాజు సైన్యంపై యుద్ధం చేసి శత్రువులను చీల్చి చెండాడి చంపింది .చివరకు బోయీలు వేసిన బాణంతో గాయపడి బొల్లావుకూడా మరణించింది. అప్పటి నుంచి యాదవులు బొల్లావును పవిత్రంగా భావిస్తారు.

కాటమరాజు యుద్ధం..

కాటమరాజు, నల సిద్ధ రాజుకు ఎర్రగడ్డపాడు వద్ద భీకర యుద్ధం జరిగింది. యుద్ధంలో కాటమరాజు నల్ల సిద్ధిరాజును చంపాడు. ఆ యుద్ధంలో కాటమరాజు మంత్రి పద్మ రాఘవుడు నల్ల సిద్ధిరాజు మంత్రి బిమన్నాను చంపాడు. యుద్ధంలో యాదవులు నల్ల సిద్ధిరాజుపై విజయం సాధించారు. అయితే యుద్ధంలో తగిలిన గాయాల వల్ల చనిపోయారు. ఈ విధంగా కాటమరాజు యుద్ధం చరిత్రలో పేరు ప్రఖ్యాతలుగాంచింది.

భక్తిరన్నడు కథ..

పోలురాజు ,సిరిదేవి కొడుకు భక్తిరన్నడు. వీరి పితామహుడు ఎర్రగడ్డ పాడు వద్ద యుద్ధం చేసే సమయంలో భక్తిరన్నాడు శివ భక్తుడుగా కాశీలో ఉన్నాడు. తమ పితామహులు చనిపోయిన విషయం తెలిసి ఎర్రగడ్డపాడుకు వచ్చాడు. అక్కడ చనిపోయిన వారి పిండాలను కాశీకి తీసుకుపోయి పిండ ప్రధానం చేశాడు .కాశీ నుండి వచ్చేంతవరకు ఎర్రగడ్డ పాట వద్ద జరిగిన యుద్ధభూమిలో కాపలా ఉన్న గంగకు బలులు ఇవ్వడం, బోనాలు పెట్టడం లాంటివి ప్రతి సంవత్సరం జాతరగా జరిపిస్తున్నారు. అందులో భాగంగా గంగ జాతర ప్రతి సంవత్సరం వైశాఖ బహుళ పాడ్యమి నుంచి పంచమి వరకూ నిర్వహిస్తారు. తమ తండ్రుల పేరు మీదుగా భక్తనయ్య, కాటమరాజు ఏలిన కోటకి పడవ వైపున ఉన్న కొండమీద ఐదుగురు పేర్లు మీదుగా లింగాలు ఏర్పాటు చేశారు. అదే నేడు పంచలింగాల కొండగా ప్రఖ్యాతి గాంచినది. ఇక్కడ శివరాత్రి సందర్భంగా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.

తిరునాళ్లకు ముస్తాబైన గంగమ్మ గుడి

ప్రజాశక్తి- పిసిపల్లి

పాలేటి గంగమ్మ తిరునాళ్లలో ప్రధాన ఘట్టామైన సాంస్కతిక వేడుకల కోసం గుడి ఆవరణ మొత్తం సర్వం సిద్ధమైంది. శుక్రవారం రాత్రి సాంస్కతిక కార్యక్రమాలు, విద్యుత్ ప్రభలు, కోలాటిన్ని నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గుడి వద్ద 9 విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేస్తున్నారు. తిరునాళ్లకు అధిక సంఖ్యలో భక్తులు వస్తురనే అంచనాలతో పోలీసులు ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు .కనిగిరి డిఎస్‌పి సాయి ఈశ్వర్ యశ్వంత్ ఆధ్వర్యంలో కనిగిరి సిఐ ఖాజావలి, పిసిపల్లి ఎస్‌ఐ కోటయ్య ఆధ్వర్యంలో గత 15 రోజులుగా శాంతి భద్రతలపై సమీక్ష నిర్వహించారు. బుధవారం కూడా ప్రభ నిర్వాహకులు మరియు చుట్టుపక్కల గ్రామాల నాయకులతో చర్చలు నిర్వహించారు. గతంలో కంటే ఈ సంవత్సరం పోటీపడి ప్రభలను ఏర్పాటు చేస్తున్నారు. పోతవరంలో ఒకే పార్టీకి చెందిన ఇరువర్గాలవారు ప్రభలు ఏర్పాటు చేశారు. వెంగళాపురంలో కూడా అదే విధంగా ఒకే పార్టీ వారు ప్రభలు ఏర్పాటు చేస్తున్నారు. రోడ్డుకి ఒకవైపున వైసిపి వారు, రెండవ వైపున టిడిపి వారు ప్రభలు, ఫ్లెక్సీలు బ్యానర్లు ఏర్పాటు చేసుకునే విధంగా పోలీసులు సూచనలు చేశారు. తహశీల్దారు ఉష ఒక్కో విద్యుత్ ప్రభకు సంబంధించి ఐదుగురు చొప్పున మరియు కోలాట బందం తరపున బైండోవర్ చేసుకున్నారు. ప్రభల ముందు , కోలాటం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. తిరునాళ్ల సందర్భంగా ఈ పాటికే సుమారు 250కి పైగా దుకాణాలు వెలిశాయి. గత 15 రోజుల నుంచి రంగులరాట్నం మరియు రకరకాల ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేశారు. ఎంపిడిఒ ప్రభాకర్ శర్మ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు, క్లోరినేషన్ చేయించారు. కనిగిరి డిప్యూటీ డి ఎం అండ్ డి హెచ్ఒ సుజనా ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ వైద్యులు డాక్టర్ యషిత డాక్టర్మంజుల వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. తిరునాళ్లకు వచ్చే భక్తుల కోసం శుక్రవారం ఉదయం నుంచి ఉచిత అన్నదాన సత్రాలను కులాలవారీగా ఏర్పాటు చేశారు.



స్వామివారిని ఊరేగిస్తున్న గ్రామస్తులు

సీతారామస్వామి కల్యాణం

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండల పరిధిలోని బొంతవారిపల్లి గ్రామంలో సీతారామస్వామి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. మేళ తాళాలు నడుమ వేదమంత్రాలతో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారికి పీఠాన్ని కీర్తిశేషులు దుగ్గా రాజశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన భార్య సరళరెడ్డి అందజేశారు.కీర్తిశేషులు మూడీ అల్లూరయ్య సతీమణి రమాదేవి స్వామివారికి గుర్రం బహూకరించారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి -నాగులుప్పలపాడు

మండల పరిధిలోని ఉప్పుగుండూరులో వేంచేసి ఉన్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈసందర్భంగా చక్రస్నానం, పూర్ణహుతి, హోమం నిర్వహించారు. అనంతరం తెలగ సంఘం ఆధ్వర్యంలో వసంత సేవ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ రామకష్ణారావు, చైర్మన్ మాగులూరి సత్య నారాయణ, ఆలయ సిబ్బంది గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. నాగులుప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జాయింట్ కలెక్టరు ఆర్.గోపాలకష్ణ తో కలిసి కలెక్టర్ తమీమ్ అన్సారియా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై చర్యలు తప్పవన్నారు అనంతరం రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, పేషెంట్ ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ ట్రాకింగ్ విధానాన్ని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వర రావు, ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ ఓనారియల్ , వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

నేటి నుంచి నాటిక పోటీలు

ప్రజాశక్తి-దర్శి

దర్శనాపురి నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు, కార్యదర్శి అంబటి సుబ్బారెడ్డి తెలిపారు. 16న చైతన్య కళాభారతి కరీంనగర్ వారి ఖరీదైన జైలు అనే నాటిక, అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి చిగురు మేగం అనే నాటికలు ప్రదర్శన ఉంటుందన్నారు. 17న సాయి ఆర్ట్స్ కొలకలూరి వారి జనరల్ బోగీలు నాటిక, ముద్దుకూరు ఆర్ట్ క్రియేషన్స్ చిలకలూరిపేట వారి మా ఇంట్లో మహాభారతం హాస్యనాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. 18న విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాదు వారి స్వేచ్ఛ నాటిక ప్రత్యేక ప్రదర్శన, సాంప్రదాయ కూచిపూడి, గురుకులం శ్రీకాకుళం వారి ద్రౌపది కూచిపూడి సంగీత బుచ్చరూపకం ఉంటుందన్నారు. నాటికల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా టిడిపి దర్శి నియోజక ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ కడియాల లలితసాగర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, డిఎస్‌పి బి.లక్ష్మీనారాయణ, ఆర్‌డిఒ రవికుమార్, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు హాజరవుతారన్నారు. ప్రజలు, నాటక ప్రియులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.



పంట వివరాలను పరిశీలిస్తున్న అధికారులు

పంటల వివరాలు తనిఖీ

ప్రజాశక్తి-టంగుటూరు

రైతులు సాగు చేసిన పంటల వివరాలను తనిఖీ చేసినట్లు కేంద్ర గణాంక అధికారి, జేడీ శ్రీనివాసరావు తెలిపారు. జరుగుమల్లి మండలం పాలేటిపాడు గ్రామంలో కేంద్ర గణాంక అధికారుల బందం గురువారం పర్యటించింది. పంటల సాగు విస్తీర్ణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పాలేటిపాడు గ్రామాన్ని నాలుగు క్లస్టర్స్‌గా విభజించినట్లు తెలిపారు. 5 సర్వే నంబర్లను ఎంపిక చేసి వాటిలో రైతులు ఏయే పంటలు సాగు చేరనే విషయాన్ని పరిశీలించినట్లు తెలిపారు. అదేవిధంగా పంట క్రాప్ బుకింగ్ యాప్‌లో నమోదును క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. పంటలు సాగు చేయని భూములు ఉన్నాయా లేదా అనే విషయాన్ని కూడా పరిశీలించినట్లు తెలిపారు. . ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి యుగంధర్ రెడ్డి, సూపరింటెండెంట్ రామకష్ణ, సహాయ గణాంక అధికారి సుబ్రహ్మణ్యం, గ్రామ రెవెన్యూ అధికారి రాకేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు రామస్వామి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరు మండల పరిధిలోని మర్లపాడు రెవెన్యూ గ్రామ పరిధిలోని రైతులు సాగు చేసిన పంటను కేంద్ర, రాష్ట్ర గణాంకాల అధికారులు, వ్యవసాయ సిబ్బంది, రెవెన్యూ శాఖ సిబ్బంది తనిఖీ చేశారు. వ్యవసాయ భూములు, భూకమతాల వినియోగం పై జాతీయ సాంఖ్యకీయ ప్రాంతీయ కార్యాలయ సహాయ సంచాలకులు గంపా శ్రీనివాసరావు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంపా శ్రీనివాసరావు మాట్లాడుతూ మర్లపాడు గ్రామానికి సంబంధించి వ్యవసాయ కమతాలలో ఏఏ పంటలు రైతులు పండించారు, విత్తనాల అందుబాటులో ఉన్నాయా, లేదా, ఈ క్రాప్ ద్వారా నమోదు తదితర అంశాలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీ శ్రీనివాసరావు, సీనియర్ గణాంకాధికారి టి.రామకష్ణ, ప్రసాదరావు, ఎఒ జి. స్వర్ణ లత, మండల సహాయ గణాంకాధికారి ఒ. శ్రీవాణి , వ్యవసాయ విస్తరణ అధికారి ఎన్. వెంకటేశ్వర్లు, గ్రామ వ్యవసాయ సహాయకులు సౌమ్య, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతుల ధర్నా

ప్రజాశక్తి-పొన్నలూరు

పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు ధర్నా నిర్వహించారు. కందుకూరు – కనిగిరి రహదారిపై మంగళ వారం బైటాయించారు. దీంతో వాహనాల రాక పోకలు నిలిచి పోయాయి. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. ఈ సంద ర్భంగా రైతులు మాట్లాడుతూ కంపెనీలు గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం గిట్టుబాటు ధరలకు పొగాకును కొనుగోలు చేయాలన్నారు. గిట్టు బాటు ధరకు కొనుగోలు చేయకపోతే తాము నష్టాల బాట పట్టాల్సి వస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించి తమను ఆదుకోవాలని కోరారు. లేకేంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న రైతులు

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- మద్దిపాడు

ఈనెల 20న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మి తెలిపారు. మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రోత్ సెంటర్‌లోని కార్మికులను గురువారం కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పరిశ్రమలలో పనిచేసే కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను కార్మికులకు తెలియజేశారు. కార్మికుల హక్కులను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ఉద్యమాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మద్దిపాడు లారీ యూనియన్ ఆఫీసులో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఉబ్బా వెంకటేశ్వర్లు కరపత్రాలు పంపిణీ చేశారు. రవాణా రంగం కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. దేశవ్యాప్త సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలపాని ఆయన కోరారు.



కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఆదిలక్ష్మి

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

ప్రజాశక్తి- సిఎస్‌పురం రూరల్

ప్రభుత్వం 50 శాతం రాయితీపై అందిస్తున్నన పచ్చి రొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఒ సంపత్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని పెదరాజుపాలెం సచివాలయం వద్ద పచ్చిరొట్ట విత్తనాల వల్ల కలిగే ఉపయోగాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ జనుము, జీలుగ, పిల్లి పెసర లాంటి పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేసి పూతకు వచ్చిన వెంటనే భూమిలో కలియ దున్నిట్లయితే నేలలో సేంద్రీయ కర్బన శాతం పెరుగుతుందన్నారు. భూమి సారవంతంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ పావలి శ్రీనివాసులు, విఎఎ అఖిల్ బాబు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండల పరిధిలోని చింతగుంట్ల గ్రామంలో మాజీ సర్పంచి రాగి గురవయ్య మనమరాళ్లు శ్రావణి, లక్ష్మి పుష్పాలంకరణ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ వేడుకల్లో పలువురు నాయకులు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి రాగి గురవయ్య, పొదిలి మానవత సంస్థ కమిటీ సభ్యులు ఎద్దు నగేష్, నాయకులు సిగనం కొండయ్య, రాగి వెంకటేశ్వర్లు, పాపారావు, నారాయణ, ఎపి రైతు సంఘం అధ్యక్షుడు సిగినం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-కొండపి


ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కొండపి ప్రభుత్వ జూనియర్ కళాశాలో ల్యాబ్ ఆన్ వీల్స్ ప్రోగ్రాంను రెండు రోజుపాటు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆధునిక సాంకేతికపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు ప్రముఖ సాఫ్టువేర్ సంస్థ ఇన్ఫోసిస్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగా పదోతరగతి ఆపై చదువుతున్న విద్యార్థులకు రోబోటిక్, ట్రాఫిక్ లైట్స్ సిస్టమ్ మరియు తదితర అంశాలపై సంబంధిత నిపుణులతో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ విద్యార్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ రవితేజ , ట్రైనర్ కార్తీక్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ అనూష , విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి మున్సిపాలిటీ అభివృద్ధికి

నిధులు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి- కనిగిరి

తిరుపతిలో తాజ్ హోటల్‌లో 16వ ఆర్థిక సంఘం సభ్యులు డాక్టర్ సౌమ్య కంటి ఘోష్ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. కార్పొరేషన్ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లతో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 16వ ఫైనాన్స్ కమిషన్ నిధులు ఎలా మంజూరు చేయాలి, వాటిని ఏ విధంగా ఖర్చు చేయాలి, స్థానిక సంస్థల అభివద్ధికి 16వ ఫైనాన్స్ కమిషన్ నిధులు ఏ విధంగా ఉపయోగపడతాయి అనే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ కనిగిరి మున్సిపాలిటీ నిధుల కొరతతో అభివద్ధికి నోచలేదని, మున్సిపాలిటీకి వచ్చే ఆదాయం నీటి సరఫరాకే సరిపోతుందని, నీటి సరఫరాకు ప్రత్యేక నిధులు మంజూరు చేసి సమస్యను పరిష్కరించాలని లేదా శాశ్వతంగా నీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని 16వ ఫైనాన్స్ కమిషన్ సభ్యులను కోరారు. సమావేశం అనంతరం ఫైనాన్స్ కమిషన్ సభ్యులకు వినతి పత్రం అందజేసి ప్రత్యేక నిధులు లేదా నీటికి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు.కనిగిరి అభివద్ధిలో భాగంగా మున్సిపాలిటీ కార్యాలయ భవన నిర్మాణం కోసం రూ. 6 కోట్లు, కూరగాయల మార్కెట్ కోసం రూ.3 కోట్లు, మటన్ మరియు చికెన్ మార్కెట్ కోసం రూ. 3 కోట్లుచ నూతన డ్రైనేజీల కోసం రూ.4 కోట్లు కలిపి మొత్తం రూ.16 కోట్లు మంజూరు చేయాలని రాష్ట్ర మున్సిపాలిటీల అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్, కమిషనర్ సంపత్ కుమార్‌ను గఫార్ కోరారు.



వినతి పత్రం అందజేస్తున్న అబ్దుల్ గఫార్

ప్లాస్టిక్ కవర్ల నిషేధం ఎక్కడ..?

- ప్రజలకు అవగాహన లేక విచ్చలవిడిగా వినియోగం
- పట్టించుకోని అధికారులు


వాడి పడేసిన ప్లాస్టిక్ కవర్లు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నియోజకవర్గం దినదినాభివృద్ధి చెంద ుతోంది. ఈ క్రమంలో యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దదోర్నాల, పెద్దారవీడు మండలాల్లో వ్యాపారాలు పెరిగిపోయాయి. దీంతో ప్లాస్టిక్ వినియోగం ఎక్కువైంది.కిరాణా దుకాణాలు, సూపర్ మార్కెట్లు, హోటళ్లు, పండ్ల దుకాణాలు, తోపుడు బండ్లు, చిరు వ్యాపారులు, చికెన్, మటన్ షాపులు, చేపలు విక్రయించే వారు, బియ్యం షాపుల యజమానులు, వర్తక వాణిజ్య వ్యాపారులు ప్లాస్టిక్‌ను అడ్డు అదుపు లేకుండా వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్ మూలంగా పర్యావరణం దెబ్బతింటుంది.

75 నుంచి 120 మైక్రాన్ల కంటే తక్కువ పరిమాణం ఉన్న ప్లాస్టిక్ కవర్లను వినియోగించకూడదనే నిబంధనలు ఉన్నాయి. అయినప్పటికీ వ్యాపారులు విచ్చలవిడిగా అమ్ముతున్నారు. దీంతో నిషేధిత ప్లాస్టిక్ వాడకం పెరిగిపోయింది. నియంత్రించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు.

అమలుపై సందేహాలు..

ప్లాస్టిక్ నిషేధం అమలు అనేక సందేహాలకు తావిస్తోంది. నిషేధం విధిస్తూ నెలలు గడిచిపోతున్నా ఇప్పటి వరకూ అధికారులు సరైన కార్యాచరణను ప్రకటించలేదు. గతంలో పంచాయతీ అధికారులు హడావుడి చేశారు. ఆ తర్వాత ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందాన తయారైంది.

ప్రభుత్వ నిబంధనలకు గండి..

గుడికి, బడికి వెళ్లినా, బజారుకు కిరాణం షాపుకు, హోటల్స్‌కు పోయినా, మార్కెట్‌కు వెళ్లినా ప్రతీ ఒక్కరు ప్లాస్టిక్ కవర్లతో దర్శనం ఇస్తున్నారు. మానవ జీవితంలో ప్లాస్టిక్ ఒభాగమైంది. మానవాళితో పాటు పర్యావరణానికి కీడు చేస్తున్న ప్లాస్టిక్ నిషేధించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. మానవాళికి పెను ముప్పుగా మారిన ప్లాస్టిక్‌ను బ్యాన్ చేయడం సాధ్యపడేలా కనిపించడం లేదు.

ప్రత్యామ్నాయ మార్గాలేవి..

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను నిషేధిస్తే వాటి స్థానంలో జూట్ బ్యాగులను, క్లాత్ బ్యాగులను అందుబాటులో ఉంచాలి. అయితే అలాంటి ప్రత్యామ్నాయ మార్గాలను ఎవరూ చూపడం లేదు. సేంద్రీయ పత్రి, వెదురు, చెక్క, మట్టి పింగాణీ, ప్రకృతిలో త్వరగా కలిసిపోయే ప్లాస్టిక్‌తో చేసిన వస్తువులను వాడాలి. మట్టి, పింగాణీ పాత్రలను ఆహారం నిల్వ చేయడానికి వినియోగించుకోవచ్చు. ప్రకృతిలో త్వరగా కలిసిపోయే కంపోస్టబుల్ కవర్లను చెత్త బుట్టల్లో వాడే కవర్లుగా, కాగితపు కప్పులకు వాడే పై పూతగా, పండ్లు, ఆహార పదార్థాలు, హోటళ్లలో పార్శిళ్లకు, పంట పొలాల్లో మట్టిని కప్పేందుకు తదితర వాటికి వీటిని వాడుకోవచ్చు. అయితే ప్రస్తుతం వీటి తయారీలు ఎక్కడా కనిపించడం లేదు. మొత్తం ప్లాస్టిక్ మయం అయ్యింది.

మత్యువాత పడుతున్న మూగజీవాలు..

ప్రజలు వినియోగించిన ప్లాస్టిక్ కవర్లను రోడ్లపై పడేయడంతో అవి తిన్న మూగజీవాలు మత్యువాత పడుతున్నాయని జంతు ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. పశువులకు తిండిసరిగా దొరకక పోవడంతో ప్రజలు పడేసే కవర్లలోని పండ్లను తినేందుకు వచ్చి పండ్లతో పాటు కవర్‌ను తింటున్నాయి. దీంతో పశువుల కడుపులోకి వెళ్లిన ప్లాస్టిక్ విషంగా మారి అవి మత్యువాత పడటం ఆందోళనకు గురి చేస్తున్నాయి.

అనర్థాలపై అవగాహన కల్పించాలి

పల్లె జాషువ, యర్రగొండపాలెం



ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలి. ప్లాస్టిక్ వాడకం మూలంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. చాలా మంది అవగాహన లేక వాటినే వినియోగిస్తున్నారు. వాటిపై అవగాహన కల్పించి ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు వాడకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలి

తొంట్ల మస్తాన్‌రెడ్డి, నాయుడుపాలెం



మానవాళి మనుగడకు పెను ప్రమాదంగా మారిన ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిషేధి ంచాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేసినా యర్రగొండపాలెం ప్రాంతంలో నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వాడకం తగ్గలేదు. వీటి మూలంగా భవిష్యత్ తరాలకు తీవ్ర ముప్పు వాటిల్లనుంది.

కార్యదర్శులకు ఆదేశాలిచ్చాం

బండారు శ్రీనివాసులు, ఎంపిడిఒ, యర్రగొండపాలెం



గ్రామాల్లో ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు వినియో గించకుండా తగిన చర్యలు తీసు కోవాలని పంచాయితీ కార్యదర్శులను ఆదేశించాం. దుకాణాల్లో తనిఖీలు చేప ట్టాలని చెప్పాం. దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తే జరిమానాలు విధించాలని తెలిపాం. ప్లాస్టిక్ కవర్ల నిషేధానికి కృషి చేస్తున్నాం.


చిన్నారులను ఆశీర్వదిస్తున్న నాయకులు

చిన్నారులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి- సిఎస్ పురంరూరల్

మండల పరిధిలోని ముండ్లపాడు గ్రామంలో పులి వరలక్ష్మి రామచంద్రారెడ్డి దంపతుల కుమార్తె జస్విత రెడ్డి, అమరావతి, చంద్రశేఖర్ రెడ్డి దంపతుల కుమార్తె లక్ష్మీ నర్మదా రెడ్డి, శివకుమారి, మాల్యాద్రి రెడ్డి దంపతుల కుమార్తె లిఖిత రెడ్డి ఓణీల ఫంక్షన్ బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వైసిపి కనిగిరి నియోజక వర్గ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్, వైసిపి రాష్ట్ర నాయకుడు చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు పాలుగుళ్ళ మల్లికార్జున రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల నారాయణరెడ్డి, జడ్‌పిటిసి మేకల శ్రీనివాసులు, వైస్ ఎంపిపి దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డి, మాజీ ఎంపీపీ భువనగిరి వెంకటయ్య, దుగ్గి రెడ్డి జయరెడ్డి, ముడుమాల నారాయణరెడ్డి, డబల్ రెడ్డి, శివారెడ్డి, వాడా లక్ష్మిరెడ్డి, మితికేలా గురవయ్య, రాధాకష్ణారెడ్డి, సిద్దు వెంకట్ రెడ్డి, బైరెడ్డి తిరుపతిరెడ్డి, డాక్టర్ షేక్ గౌస్, ప్రకాష్ రెడ్డి, దుగ్గిరెడ్డి రమణారెడ్డి, అంబాల శేఖర్ రెడ్డి, దుద్దుకూరు శ్రీనివాసులు, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు బోయళ్ళ నారాయణరెడ్డి, మారెళ్ళ రవికుమార్, బొబ్బూరి రమేష్, షేక్ రజ్జబ్ బాషా పాల్గొని చిన్నారులు జస్వితారెడ్డి, లక్ష్మీ నర్మదా రెడ్డి, లిఖిత రెడ్డిని ఆశీర్వదించారు.

పొగాకు బేళ్ల తిరస్కరణ

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు పొగాకు వేలం కేంద్రానికి మల్లవరప్పాడు, శివపురం, గొల్లమిట్ట, మట్టిపాడు గ్రామాలకు చెందిన రైతులు 757 బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 533 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 222 బేళ్లను తిరస్కరించారు.కిలో పొగాకు అత్యధిక ధర రూ. 280, అత్యల్ప ధర రూ. 205 సరాసరి ధర రూ.239-64 పైసలు పలికినట్లు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. పొగాకు వేలంలో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

కొండపి : కొండపి వేలం కేంద్రానికి కస్టర్ పరిధిలోని నేతివారి పాలెం,రామచంద్రపురం గ్రామాలకు చెందిన రైతులు 1,282 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 1,146 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 136 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు కనిష్ట రూ. 280, కనిష్ట ధర రూ.210, సరాసరి ధర రూ. 255.60 పైసలు పలికింది. వేలంలో 18 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ' మార్గదర్శకాలు విడుదల : ఎఓ

ప్రజాశక్తి- పిసిపల్లి

2025-2026 సంవత్సరానికి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేసినట్లు ఎఓ ప్రకాష్‌రావు తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా ఏడాదికి రాష్ట్ర ప్రభుత్వం రూ.14,000, కేంద్ర ప్రభుత్వం రూ.6000 రూపాయలు చొప్పున మొత్తం 20,000 వంతున ఒక్కొక్క రైతులు అందజేస్తారని తెలిపారు. ప్రతి రైతుకు సంబంధించిన డేటా వెరిఫికేషన్ ఈనెల 25లోపు ఆన్‌లైన్‌లో అన్నదాత సుఖీభవ పోర్టల్ లో రైతు సేవ కేంద్రం సహాయకులు నమోదు చేస్తారని తెలిపారు. వ్యవసాయ ఉద్యాన సెరికల్చర్ సాగు భూమి ఉన్న ప్రతి రైతు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులని తెలిపారు. డేటా వెరిఫికేషన్ తర్వాత ఆర్జిఐఎస్ పోర్టల్ డేటా రివల్ డేట్ అవుతుందన్నారు. జాబితా గ్రామస్థాయి రైతులు సేవా కేంద్రం సహాయకులకు వస్తుందని తెలిపారు. ఈ కేవైసీ ద్వారా ఆయా రైతులను మళ్లీ నమోదు చేసుకుంటే వారు చివరకు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులవుతున్నారు. అర్హత కలిగిన ప్రతి రైతు తమ ఆధార్, భూమి వివరాలతో తమ పరిధిలోని రైతు సేవా కేంద్రం సహాయకులను కలిసి వివరాలు పరిశీలించుకోవాలని ఎఓ తెలిపారు.

'కాటన్'కు నివాళి

ప్రజాశక్తి-దర్శి

సాగునీటి ప్రాజెక్టులు, కాలువలు నిర్మించి, స్థిరమైన వ్యవసాయ అభివృద్ధికి సర్ ఆర్థర్ కాటన్ చేసిన కృషి అభినందనీయని టిడిపి దర్శి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. ఓ క్తి తలుచుకుంటే అనేక అద్భుతాలు సృష్టించ వచ్చునని కాటన్ రుజువు చేశారని పేర్కొన్నారు. కాటన్ జయంతి సందర్భంగా ఆ మహానుభావుడి స్మృతికి నివాళులర్పిస్తున్నట్లు డాక్టర్ లక్ష్మి తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు చందలూరు విద్యార్థి

ప్రజాశక్తి-దర్శి


ఆనంద జయకుమార్

మండల పరిధిలోని చందలూరు జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థి ఇత్తడి ఆనంద జయకుమార్ జాతీయ స్థాయి బీచ్ త్రో బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. గురుప్రసాద్ తెలిపారు. ఈ నెల 17 నుంచి 19 వరకూ కన్యాకుమారిలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి బీచ్ త్రో బాల్ పోటీల్లో ఆనంద జయకుమార్ పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు. జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైన జయకుమార్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురుప్రసాద్, పిఇటి సోము అంజిరెడ్డి, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, స్కూల్ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు అభినందించారు.

కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి మద్దిపాడు


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఉపాధి పనుల్లో పురోగతి చూపడంతో పాటు పని ప్రదేశంలో తాగునీరు, నీడ షెడ్ తదితర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దష్టి సారించాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని ఇనమనమెల్లూరులో నిర్వహిస్తున్న ఉపాధిహ పనులను కలెక్టర్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. సాగునీటి కాలువ పూడికతీత పనులు చేస్తున్న కూలీల వద్దకు కలెక్టర్ వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలీలు చేసిన పనికి సకాలంలో వారి ఖాతాల్లో డబ్బులు పడుతున్నాయా లేదా అని ఆరాతీశారు. అదేవిధంగా కూలీల పని ప్రదేశంలో తాగునీరు, నీడ షెడ్ తదితర మౌలిక సదుపాయాల కల్పనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎండ ప్రభావం ఎక్కువగా ఉన్నందున అన్ని జాగ్రత్తలు తీసుకుని పనిచేసుకోవాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అందుబాటులో ఉండేలా చూడాలని ఉపాధి హామీ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ డ్వామా సిబ్బంది, ఉపాధి సిబ్బంది ఉన్నారు.


సమ్మర్ క్యాంపునకు హాజరైన విద్యార్థులు

నీతి కథలపై అవగాహన

ప్రజాశక్తి- కొత్తపట్నం

మానసిక ఉల్లాసానికి సమ్మర్ క్యాంపులు ఎంతో అవసరమని జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకుడుప్రసాద్, బద్మా నాయకురాలు రమాదేవి తెలియజేశారు. మండల కేంద్రమైన కొత్తపట్నంలో సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా విద్యార్థులకు గురువారం నీతి కథలు , డ్రాయింగ్ ,మ్యాజిక్, కార్టూన్స్, డ్యాన్స్ పై శిక్షణ ఇచ్చారు. డ్రాయింగ్ క్లాసులు,సులభంగా బొమ్మలు గీయడం లో మెలుకువలు నేర్పారు. ప్రకతి వ్యవసాయం యొక్క అవసరాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఎన్ రాజమోహన్

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఇంకొల్లు

స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద గురువారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. 120 మంది పెద్దలు, 20 మంది చిన్నారులకు ఉచితంగా బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఒమేగా ఆస్పటల్ ఎండి ఆంకాలజిస్ట్ డాక్టర్ నన్నపనేని రాజమోహన్, జనరల్ డాక్టర్ రజినీ వైద్య సేవలు అందించారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి - పర్చూరు

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బిఎఆర్ అండ్ టిపి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో స్కిల్ హబ్ సెంటర్ నందు కంప్యూటర్ కోర్సు మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్య అధికారి పి ప్రణయ్ తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతీ, యువకులు జిల్లాలోని వనరులు, డిమాండ్ ఆధారంగా కంప్యూటర్ కోర్సు 3నెలలు ఉచితంగా అందిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ శేషు కుమారి తెలిపారు. 18 నుంచి 35 ఏళ్లలోపు యువతీ, యువకులు మే 20లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్టిఫికెట్లు ఇస్తున్నాయని స్కిల్ హబ్ ఇంచార్జ్ పి వినోద్ కుమార్ తెలిపారు. ఇతర వివరాలకు 6302764962 నెంబర్లో సంప్రదించాలని కోరారు.

చీరాల : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక వైపే మహిళా డిగ్రీ కాలేజీ స్కిల్ హబ్ సెంటర్ నందు డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి పి ప్రణయ్ తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతీ, యువకులు జిల్లాలోని వనరులు, డిమాండ్ ఆధారంగా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు ఉచితంగా అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ మురళి తెలిపారు. 18 నుంచి 30 ఏళ్లలోపు యువతీ, యువకులు మే 25లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 7981443777 నంబర్లో సంప్రదించాలని కోరారు.

నేడు ఎక్సైజ్ కేసుల్లో వాహనాల వేలం

ప్రజాశక్తి - చీరాల

స్థానిక ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలకు బహిరంగ వేలం పాటలు నేడు నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ సూపర్డెంట్ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఈ బహిరంగ వేలంకు ప్రజలు అందరూ పాల్గొనవచ్చని తెలిపారు. ఎక్సైజ్ శాఖ నిర్ణయించిన ధరకు అదనంగా ఎవరు ఎక్కువగా పాడుకుంటారో వారికి వాహనాలు అందజేస్తామని తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుండి బహిరంగ వేలం ప్రారంభించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9440902495 నెంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవాలని కోరారు.

17న రాష్ట్ర మంత్రులు రాక

ప్రజాశక్తి - వేమూరు




తహశీల్దారు సుశీల

స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఈనెల 17న రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, కలెక్టర్ జె వెంకట మురళి, జిల్లా ప్రత్యేక అధికారి కృతిక శుక్ల, రేపల్లె ఆర్డిఓ రామలక్ష్మి రానున్నట్లు తహశీల్దారు సుశీల తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల 3వ శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్రలో భాగంగా 17న 'వేడిని తట్టుకోవటం' అనే అంశంపై కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందండి



మాట్లాడుతున్న యద్దనపూడి తహశీల్దారు కె రవికుమార్



గుర్తింపు కార్డులు అందజేస్తున్న నగరం డిటి ఎన్ సత్యనారాయణ

ప్రజాశక్తి - యద్దనపూడి

మండల కేంద్రమైన యద్దనపూడిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. రైతు సేవా కేంద్రం నందు పంట సాగుదారు హక్కు పత్రాలు రైతులకు మంజూరు చేయడంపై రైతులకు అవగాహన కల్పించారు. తహశీల్దారు కె రవి కుమార్ రైతులకు పంట సాగు హక్కు పత్రం కార్డు ఏవిధంగా పొందాలో వివరించారు. కార్డుల వల్ల ఉపయోగాల తెలిపారు. ఎఒ మేరిమ్మ ద్వారా రాయితీపై విత్తనాలు, ఎరువులు, పంట నష్ట పరిహారాలు సిసిఆర్సి కార్డు ఉన్న కౌలు రైతులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విఎఎ ఎన్ వినయ్, రైతులు సుబ్బారావు, శ్రీను, వెంకటేశ్వర్లు, రాజు వెంకటరావు పాల్గొనినారు.

నగరం : మండలంలోని అల్లపర్రు, మంత్రిపాలెం, సజ్జావారిపాలెం సచివాలయాల పరిధిలో డిటి ఎన్ సత్యనారాయణ అధ్యక్షతన పంట సాగుదారుల హక్కు పత్రాలపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కౌలు రైతు చట్టం 2019 ప్రకారం కౌలు రైతులు వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందటానికి కార్డులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్డు తీసుకున్న ప్రతి కౌలు రైతుకి 11 నెలల వరకు పండించే పంటపై హక్కు కలిగి వుంటాడని తెలిపారు. ఈ కౌలు గుర్తింపు కార్డులు అందజేసేందుకు కౌలు రైతులను గుర్తించి ప్రతి కౌలు రైతుకి కార్డ్ అందజేయాలని గ్రామ రెవెన్యూ అధికారులకు సూచించారు. అందులో భాగంగా ఎఒ వి రమేష్ బాబు మాట్లాడుతూ ఈ కౌలు రైతు కార్డ్ పొందటం ద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు, వచ్చే అవకాశం ఉంటుందని వివరించారు. అన్నదాత సుఖీభవ, సున్నా వడ్డీ పంట రుణాలు, పంటల భీమా, పంట నష్ట పరిహారం, పండించిన పంట అమ్ముకోవడానికి, పంట రుణాలు పొందటానికి కౌలు గుర్తింపు కార్డు ఉపయోగ పడుతుందని తెలిపారు. కావున గ్రామాల్లో ప్రతి కౌలు రైతు ఈ సిసిఆర్సి కార్డు పొందాలని తెలిపారు. సచివాలయంలో విఆర్ఒను సంప్రదించాలని కోరారు. జీలుగ, జనుము, పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ, కౌలు రైతులు సిసిఆర్సి కార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఎఒ కె నాగ శ్రీనివాసరావు, విఆర్ఒ పి చిట్టిబాబు, మంత్రిపాలెం సర్పంచ్ మల్లంపాటి ప్రమీల పాల్గొన్నారు.

కారంచేడు : మండలంలోని అదిపూడి, తిమ్మిడితపాడు సచివాలయాల పరిధిలో పంట సాగు దారుల హక్కు పత్రాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు జి నాగరాజు మాట్లాడుతూ కౌలు రైతు గుర్తింపు కార్డు తీసుకోవడం వల్ల ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. కౌలు రైతు కార్డులు తీసుకోవటం వలన కౌలు రైతులకు ఎటువంటి భూమి హక్కు సంక్రమించదని తెలిపారు. ఎఒ కె సుధీర్ బాబు మాట్లాడుతూ జీలుగ, జనుము పచ్చిరొట్ట విత్తనాలు కావలసిన రైతులు రైతు సేవ కేంద్రంలోని వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఆధార్ కార్డ్, పట్టాదార్ పాసుబుక్ జీరాక్స్ కాపీలు అందజేసి విత్తనాలు తీసుకోవాలని తెలిపారు. పంటల భీమా, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం, వ్యవసాయ రుణాలు, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వీరికి కూడా వర్తిస్తాయని అన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు, విత్తనాలు తదితర సౌకర్యాలు పొందే అవకాశం ఉందన్నారు. గుర్తింపు కార్డు తీసుకోవాల్సిన రైతులు విఆర్ఒలను సంప్రదించి కౌలు రైతులు కార్డులు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో తిమ్మిడితపాడు సర్పంచ్ సుబ్బులు, వైస్ సర్పంచ్ బోడవుల రంగనాయకులు, సెక్రటరి, అదిపూడి టీడీపీ నాయకులు డి నాగమల్లేశ్వరావు, విఆర్ఒ మత్తయ్య, విఎఎలు ఎం శాంతి, టి వెంకటయ్య పాల్గొన్నారు.

చెరుకుపల్లి : కౌలు రైతులు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని ఎఒ టి బాలాజీ గంగాధర్ తెలిపారు. కౌలు రైతులకు అవగాహన గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. గూడవల్లి, రాజోలు గ్రామ రైతు సేవ కేంద్రాల వద్ద నిర్వహించిన సదస్సులో కౌలు రైతు కార్డుల వల్ల జరిగే ప్రయోజనాలు రైతులకు వివరించారు. కౌలు సాగు గుర్తింపు కార్డులను పొందాలని తెలిపారు.



కౌలు గుర్తింపు కార్డులు అందజేస్తున్న కారంచేడు తహశీల్దారు



గ్రామ సభలో మాట్లాడుతున్న చెరుకుపల్లి ఎఒ టి బాలాజీగంగాధర్



విద్యార్థినికి నగదు అందజేస్తున్న బండారుపల్లి హేమంత్ కుమార్

ఉత్తమ విద్యార్థులకు నగదు పురస్కారం

ప్రజాశక్తి - చీరాల

10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నగదు పురస్కారాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్లో రోటరీ సభ్యులు దోగుపర్తి వెంకట సురేష్ జన్మదినం సందర్భంగా చీరాల, వేటపాలెం మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన 18మంది విద్యార్థులను గురువారం సత్కరించారు. ఎఎంసి ఛైర్మన్ కౌతవరపు జనార్ధనరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఎన్ఆర్ అండ్ పిఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ నుండి రూ.18వేల విలువైన విద్యా సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా పందిళ్ళపల్లి హైస్కూల్ నందు 596 మార్కులు సాధించిన సజ్జా దివ్యశ్రీకి బండారుపల్లి హేమంత్ కుమార్ రూ.11,116 అందించగా అదనంగా కొంత కలిపి రూ.14,432 అందజేశారు. వేటపాలెం బిబిహెచ్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంక్ సాధించిన తుమ్మలపెంట శ్రీవిష్ణుప్రియకి డివి సురేష్, మరి కొందరు కలసి రూ.4,316 నగదు అందజేశారు. కార్యక్రమంలో సిహెచ్ బాల వెంకటేశ్వరరావు, నక్కల సురేష్ బాబు, పోలుదాసు రామకృష్ణ, చారగుళ్ళ గురు ప్రసాద్, గుర్రం రాఘవరావు, కరణం శ్రీనివాస బాబు, జివై ప్రసాద్, నారాయణమూర్తి, శీరాం రమేష్, డాక్టర్ ఐ బాబూరావు, జాలాది కృష్ణ, పూర్ణా, వీరాంజనేయులు, శ్రీనివాసరావు, నాగరాజు, ఉమా మహేశ్వరరావు, రోటరీ, వాకింగ్ సభ్యులు, యోగా సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు మార్జిన్‌లో ఆగిన అక్రమ నిర్మాణం

ప్రజాశక్తి - వేటపాలెం

ప్రజాశక్తి కథనానికి స్పందన

సిమెంట్ రోడ్డు మార్జిన్ ఆక్రమించి తలపెట్టిన అక్రమ నిర్మాణం ఆగింది. సిమెంట్ రోడ్డు అంచు లోపలకు తవ్విన గాడిని పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు పూడ్చివేశారు. సిమెంటు రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించి అక్రమ కట్టడం నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్న విషయంపై ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైంది. వేటపాలెం పట్టణ నడిబొడ్డున వేటపాలెం నుండి చీరాల వెళ్లే వన్‌వే రోడ్డు నుండి వెంకటేశ్వర స్వామి గుడికి కూతవేటు దూరం నుండి బాణాల లొంపలోకి వెళ్లే పంచాయతీ రోడ్డు అంచు భాగం వరకు తొలచి పిల్లర్ వేయటానికి సిద్ధం చేశారు. ఈ సంఘటనపై స్థానికులు పంచాయితీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవని విమర్శిస్తున్నారు. పంచాయితీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని 'ప్రజాశక్తి' కథనం ప్రచురించింది. సంబంధిత ఉన్నతాధికారులు అక్రమ కట్టడం పట్ల స్పందించారు. తక్షణమే రోడ్డు మార్జిన్ గుంతలను పూడ్చివేయాలని ఆదేశించారు. అధికారుల ఆదేశాల మేరకు సిమెంటు రోడ్డు మార్జిన్ ఆక్రమించి తీసిన గుంతలు పూడ్చి వేశారు.



యధావిధిగా మట్టిపూడ్చిన దృశ్యం

అనుమతి లేని టోల్ వసూళ్లపై కేసు నమోదు

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని గాజులలంక నుండి కృష్ణ జిల్లా శ్రీకాకుళం గ్రామానికి వేసవి కాలంలో నదిలో నీరు లేని సమయంలో ఈ రెండు గ్రామాల ప్రజలు రాకపోకలకు ప్రభుత్వ అనుమతులు ఎలాంటివి లేకుండా కృష్ణా నదిలో గాలు ఏర్పాటు చేసి వాహనదారుల అడ్డగించి బలవంతంగా టోల్ రుసుం వసూలు చేస్తున్న గాజుల సోమేశ్వరరావు, ఆంజనేయులు, గాజుల మహేష్, కొల్ల దివాకర్ అనే వ్యక్తులపై గాజులంక విఆర్ఓ షేక్ నూర్జహాన్ ఇచ్చిన రిపోర్టుపై ఎస్ఐ వై అర్జునరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అక్రమంగా టోల్ వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు.

కూలేందుకు సిద్ధంగా పల్లెపాలెం పాఠశాల



పెసర్లంక పల్లిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఎన్నో ఏళ్లుగా పెసర్లంక పల్లెపాలెం ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. గోడలు పగిలిపోయి, స్లాబు పెచ్చులుడిపోతూ ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఒకప్పుడు 70 నుండి 100కిపైగా విద్యార్థులున్న పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో ఆ ప్రాంతంలోని విద్యార్థులను బడికి పంపడం మానేశారు. శిథిలావస్థకు చేరిన భవనంలో ఏ సమయంలో ఏమి జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళనకు గురై సమీపంలోని ప్రైవేటు పాఠశాలను ఆశ్రయించాల్సి వస్తుందని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. గత టిడిపి ప్రభుత్వ పాలనలోనే ఈ భవనం స్థానంలో నూతన భవనం ఏర్పాటు చేయాలని అప్పట్లో గ్రామస్తులు కోరడంతో కొన్ని కారణాలుతో పనులు జరగలేదు. ఆతర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వంలో నాడు నేడు పథకం కింద ఈ భవనాన్ని తొలగించి నూతన పాఠశాల తరగతి గదిలో ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేశారు. అయితే పాఠశాల సమీపంలోని రైతులు కొన్ని కారణాలతో అడ్డుకోవడంతో భవన నిర్మాణ పనులు జరగకుండా నిలిచిపోయాయి. దీంతో ఆ నిధులు వెనక్కు వెళ్లాయి. శిథిలావస్థకు చేసిన పాఠశాల్లో 15 మంది విద్యార్థులు ఇప్పటికీ ఇదే పాఠశాలలోనే బిక్కుబిక్కుమంటూ చదువుకున్నారు. ఇప్పటివరకు పిల్లల్ని పంపిన తల్లిదండ్రులు ఈ విద్యా సంవత్సరం నుండి తమ పిల్లలను పంపించలేమంటూ గ్రామస్తులు వ్యాఖ్యానిస్తున్నారు.

నేతల మధ్య శిగపట్లతో నిలిచిన భవనం

గత పదేళ్లుగా పల్లెపాలెం పాఠశాల శిథిలావస్థకు చేరి దెబ్బతినడంతో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నప్పటికీ ఆ ప్రాంతంలోని స్థల వివాదంలో ఒకరిపై ఒకరు పట్టుదల కారణంగా నూతన భవనానికి దూరమైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ పాఠశాల దళితవాడ, మత్స్యకార కుటుంబాలకు అనుసంధానంగా ఉంటుంది. పాఠశాల శిథిలావస్థకు చేరి మూత పడిపోతే తీవ్రంగా నష్టపోయేది ఈ రెండు వర్గాలే. గ్రామంలో అగ్రవర్ణాలకు ప్రభుత్వ పాఠశాలపై ఎలాంటి మక్కువ లేదు. వారికి సమీపంలో ప్రైవేటు పాఠశాల ఉందని, ఆర్థిక స్తోమత కలిగిన వారు ఆ పాఠశాల్లో పిల్లలను చేర్పించుకుంటారని, ప్రభుత్వ పాఠశాల మూతపడితే నష్టపోయేది దళిత, బలహీనవర్గాలు మాత్రమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల సమీపంలోని పోతురాజు శిలకు సంబంధించి గ్రామస్తులు, రైతుల మధ్య నెలకొన్న వివాదాల కారణంగా ప్రభుత్వ పాఠశాలను నిర్వీర్యం చేయటం సరైనది కాదని, అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి ఇరువర్గాలను సమన్వయం చేసి పాఠశాల మూతపడకుండా చూడాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎంఇఒ నీలం దేవరాజ్ మాట్లాడుతూ రానున్న విద్యా సంవత్సరానికి ఈ పాఠశాల్లో విద్యార్థులకు విద్య నేర్పించే పరిస్థితి లేదన్నారు. ఉన్న తరగతి గదులు పూర్తిగా దెబ్బతిని ప్రమాద భరితంగా మారాయని, రానున్న విద్యా సంవత్సరానికి పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ఇబ్బంది లేని విధంగా సమీపంలో తాత్కాలికంగా రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టి పాఠశాల కొనసాగించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చిస్తున్నట్లు వివరించారు.



పగుళ్లు ఇచ్చిన పాఠశాల భవనం గోడలు



పెచ్చులూడిపోయిన పాఠశాల స్లాబు



కౌలు రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎడిఎ మోహనరావు

పంట సాగుకార్డు ఉంటేనే రాయితీలు

ప్రజాశక్తి - పర్చూరు

పంట సాగు చేసే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు త్వరలో జారీ చేస్తామని ఎడిఎ మోహనరావు తెలిపారు. మండలంలోని బోడవాడలో కౌలు రైతుల సాగు గుర్తింపు కార్డులపై కౌలు రైతులకు అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు సాగు చేసే రైతులు పొలం ఉన్న రైతుల నుండి అంగీకార పత్రాన్ని తీసుకువచ్చి వంట సాగు చేస్తున్నట్లు వ్యవసాయ కార్యాలయం లేదా రెవిన్యూ కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. ఎఒ రామ్మోహనరెడ్డి రైతులకు అన్నదాత సుకీభవ, పచ్చిరొట్ట ఎరువులు, ప్రకృతి వ్యవసాయం గురించి వివరించారు. ఉపసర్పంచి కన్నెగంటి సాంబయ్య పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న దాతలు


మండప నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - అద్దంకి

శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం రాత్రి ముఖ మండప నిర్మాణానికి పట్టణానికి చెందిన చిన్ని సుధాకరరావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు లక్ష్మీ, తులసిమ్మ, శ్రీనివాసరావు, ఉమాదేవి దంపతులు కార్యనిర్వాహణ అధికారి మదమంచి తిమ్మనాయుడుకు చెక్కు రూపంలో విరాళం గురువారం అందించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

కోనేటిపురంలో విద్యుత్ కోత

ప్రజాశక్తి - భట్టిప్రోలు



అంధకారంలో కొనేటిపురం

మండలంలోని కోనేటిపురంలో శుక్రవారం మధ్యాహ్నం రెండున్నర నుండి రాత్రి ఏడున్నర గంటల వరకు విద్యుత్తు లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఎలాంటి సమయపాలన లేకుండా విద్యుత్తు కోతల విధించే అధికారులు కోనేటిపురం గ్రామం పట్ల వివక్ష చూపుతున్నారని, ఇక్కడ విద్యుత్తు కార్యాలయంకు సంబంధించి ఎలాంటి సిబ్బంది లేకపోవడంతో సకాలంలో విద్యుత్తు పొందలేక పోతున్నామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పక్కనే ఉన్న సూరేపల్లి, పల్లెకోన గ్రామంలోనూ విద్యుత్ సౌకర్యం ఉన్నప్పటికీ మధ్యలో ఉన్న కోనేటిపురంలో మాత్రమే ఎందుకు విద్యుత్ కోత విధిస్తున్నారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ విధానం నిత్యం ఇలాగే జరుగుతుందని వాపోతున్నారు. ప్రస్తుత వేసవిలో ఉక్కపోతతో గృహాల్లో ఉండలేని పరిస్థితుల్లో విద్యుత్తు లేకపోవడంతో మరింత అవస్థలకు గురవుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని తమ గ్రామం పట్ల నెలకొన్న విద్యుత్ వివక్ష తొలగించి ప్రజల ఇబ్బందులు తీర్చాలని కోరుచున్నారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ ఎఇ శాంతి కుమారి మాట్లాడుతూ గ్రామంలో పలుచోట్ల మరమతుల కారణంగా కోత విధించినట్లు తెలిపారు. మర మత్తులు పూర్తికాగానే విద్యుత్తు అందిస్తామని చెప్పారు.



త్రిబుల్ ఐటీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - చెరుకుపల్లి

త్రిబుల్ ఐటీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఇఒ పులి లాజర్ తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు మే 20లోగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 10వ తరగతి మార్కులు ఆధారంగా సీట్ల ఎంపికతోపాటు అర్హత గల వారికి ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ సదుపాయం ఉందని తెలిపారు. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 4400 సీట్లు ఉన్నాయని, జూన్ 5న జాబితా విడుదల చేస్తారని జూన్ 11 నుండి అర్హులైన విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తారని తెలిపారు. అర్హతలున్న విద్యార్థులు ఆర్జీయుకెటి వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జూన్ 30 నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని తెలిపారు. పీహెచ్‌సి, క్యాప్, ఎన్సీసీ, స్పోర్ట్స్, స్కౌట్స్ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో క్యాంపస్‌లో వెయ్యి సీట్లు, అదనంగా ఈడబ్ల్యూఎస్ సీట్లు మరో 100 ఉన్నాయని తెలిపారు. మొత్తం 4 క్యాంపసుల్లో కలిపి 4,400 సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. స్కాలర్ షిప్ రాని ఓసీ అభ్యర్థులు మాత్రం పియుసికి ఏడాదికి ట్యూషన్ ఫీజు రూ.45వేలు, ఇంజినీరింగుకు ఏడాదికి రూ.50వేలు ఫీజుగా నిర్ణయించారని తెలిపారు. తెలుగేతర రాష్ట్రాల విద్యార్థులకు 25శాతం సూపర్ న్యూమరరీ సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తెలుగేతర రాష్ట్రాల అభ్యర్థులు సంవత్సరానికి ట్యూషన్ ఫీజు రూ.1.50 లక్షలు చెల్లించాలని తెలిపారు. పియూసి తర్వాత ఇంజనీరింగ్ ఇతర కోర్సుల కోసం ట్రిపుల్ ఐటీ నుంచి బయటకు వెళ్లి చదువుకునే అవకాశం ఉందని తెలిపారు. అప్లికేషన్లో అభ్యర్థి మెరిట్ కేటగిరీ వారీగా అభ్యర్థులు ఎంపిక చేసుకున్న ప్రాధాన్యం ప్రకారం క్యాంపస్ కేటాయిస్తారని తెలిపారు. ఒకసారి క్యాంపస్ కేటాయించిన తరువాత బదిలీలు ఉండవని తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ ప్రకారం సీట్లు భర్తీ చేస్తారని తెలిపారు.

ఏలూరి చొరవతో రైతుల సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - పర్చూరు

శాసన సభ్యులు ఏలూరు సాంబశివరావు ఆదేశాలతో హైవే అధికారులు వెంటనే స్పందించి తిమ్మరాజుపాలెం రైతుల సమస్య పరిష్కరించారు. వాడరేవు, పిడుగురాళ్ల హైవే విస్తరణలో భాగంగా తిమ్మరాజుపాలెం గ్రామం వద్ద బైపాస్ రోడ్డు నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో సదరు హైవే రోడ్డు తిమ్మరాజుపాలెం ఎత్తిపోతల పథకం అండర్ గ్రౌండ్ పైప్ లైన్ మీదుగా క్రాస్ అయ్యి వెళ్ళుచున్నదని, హైవే రోడ్డు మీదుగా భారీ వాహనాలు ప్రయాణించే పరిస్థితిలో రోడ్డు కింద ఉన్న ఎత్తిపోతల పథకం పైప్ లైన్ దెబ్బతినే ప్రమాదం ఉందని, అందువలన ఆయకట్టు ప్రశ్నార్థకం అయ్యే ప్రమాదాన్ని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్య తీవ్రతను గుర్తించిన వెంటనే ఎమ్మెల్యే హైవే అధికారులు, ఐడిసి అధికారులకు సమస్య పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో కదిలిన హైవే అధికారులు సమస్య ఉన్న ప్రాంతంలోని నలభై మీటర్ల పొడవున పాత పైపులను మార్చి హెవీ లోడు తట్టుకొనే పైపులను, వాటిమీద బాక్స్ కల్వర్టు నిర్మాణం చేపట్టడంతో తమ సమస్య పరిష్కారమైందని గ్రామ రైతులు ఎమ్మెల్యే ఏలూరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



తిమ్మరాజుపాలెం వద్ద నిర్మిస్తున్న అండర్ పైప్‌లైన్

రేషన్ కార్డుల నమోదు కేంద్రం మూత

ప్రజాశక్తి - ముండ్లమూరు

ముండ్లమూరు సచివాలయంలో కొత్త రేషన్ కార్డు నమోదుకు సచివాలయంలో నమోదు కేంద్రం ఏర్పాటు చేశారు. ఈనెల 6 నుండి 30వరకు కొత్త రేషన్ కార్డులు, కార్డుల్లో చేర్పులు, మార్పులకు ప్రభుత్వ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ దీనికి విరుద్ధంగా సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ప్రవీణ్ కుమార్‌ను దర్శిలో కొత్త పెన్షన్ నమోదుకు గతంలో ఉన్న ఎంపిడిఒ ఆర్ జనార్ధన్ ప్రవీణ్‌కు దర్శిలో డ్యూటీ వేయడంతో ఇక్కడ నమోదు కేంద్రం మూతపడింది. కొత్తగా కార్డులకు దరఖాస్తు చేసుకున్న వారు, కార్డుల్లో తప్పులు సరి చేసుకొనుటకు పేరు నమోదుకు సచివాలయం చుట్టూ తిరుగుతున్నప్పటికీ పట్టించుకున్న నాధుడు లేడని దరఖాస్తుదారులు వాపోతున్నారు. గత ఐదేళ్ల నుండి కొత్త రేషన్ కార్డుల ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈనెల 6 నుండి 30వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జారీ చేసినప్పటికీ ఇప్పటికి పది రోజులు గడిచిన మండలంలో ఒక్క దరఖాస్తు కూడా డిజిటల్ అసిస్టెంట్ నమోదు చేయలేదు. రోజు రేషన్ కార్డు దారులు కార్యాలయానికి వచ్చి వెళుతున్నారు. కార్డుల్లో పేర్ల సవరణలు, పిల్లల పేర్లు చేర్చుకోవడం, వివాహమైన వారికి కొత్తకార్డులకు ధరకాస్తులు చేసుకోవడం వంటి సమస్యలపై కార్యాలయానికి వచ్చి వెళుతున్నారు. అన్ని మండలాల్లో సవరణలకు ధరకాస్తులు తీసుకుంటుంటే తమకు ఈ సమస్య ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నమోదు కేంద్రం మూత పడటంతో రేషన్ కార్డుల దరఖాస్తుదారులు అయోమయంలో పడిపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి రేషన్ కార్డు కేంద్రానికి డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించాలని, తమ రేషన్ కార్డుల సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రూపు తగాదాలకు తావివ్వొద్దు

- ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు
- మండల పార్టీ అధ్యక్షులుగా గుండపనేని శ్రీను ఎన్నిక



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్ధన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

తెలుగుదేశం పార్టీలో గ్రూపు రాజకీయాలకు తావు ఇవ్వొద్దని, అంతా కుటుంబసభ్యులేనని, అందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు పిలుపునిచ్చారు. ఒంగోలు నగరంలోని బృందావనం ఫంక్షన్ హాలులో టిడిపి ఒంగోలు రూరల్ మండల సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. గత ఎన్నికల్లో టిడిపికి వచ్చిన మెజార్టీపై పంచాయతీలు, పోలింగ్ బూత్‌ల వారీగా వచ్చిన ఓట్ల సంఖ్యను కార్యకర్తలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ గ్రామాలలో చిన్నచిన్న విభేదాలు ఉంటే కుటుంబ సభ్యుల్లా కలిసికట్టుగా కూర్చొని సమస్యను పరిష్కరించుకుందామని సూచించారు. పార్టీ కోసం అందరూ కలిసికట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఒంగోలు రూరల్ మండలంలో గతంలో చేసిన అభివద్ధి పనులను నాయకులు, కార్యకర్తలకు వివరించారు. భవిష్యత్తులో పార్టీ కోసం పనిచేసిన వారికి పదవులలో గుర్తింపును ఇస్తామని తెలిపారు. సమావేశంలో 14 పంచాయతీలకు కొత్త గ్రామ కమిటీ అధ్యక్షులను ఎన్నుకున్నారు. మండల పార్టీ అధ్యక్షులుగా గుండపనేని శ్రీనివాసరావు, మండల తెలుగు యువత అధ్యక్షులుగా వలేటి రాంబాబును, 13 అనుబంధ సంఘాల అధ్యక్షులును ఎన్నుకున్నారు. మండల క్లస్టర్ కన్వీనర్‌గా నల్లమోతు బాలగంగాధర్‌ను నియమించారు. సమావేశంలో పార్టీ ఒంగోలు రూరల్ మండల నాయకులు ఏఎంసి మాజీ ఛైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, పోలవరపు వెంకట్రామయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి నల్లమోతు బాల గంగాధర్, మండల పార్టీ అధ్యక్షులు గుండపనేని శ్రీనివాసరావు, పిల్లుట్ల సుధాకర్‌రావు, గద్దె కృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఉపాస్' ఆధ్వర్యంలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

ఒంగోలు ఫుడ్ కార్పొరేషన్ అఫ్ ఇండియా ఆఫీస్ ఆవరణలో ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఫుడ్ కార్పొరేషన్ అఫ్ ఇండియా ఉద్యోగులు, కుటుంబసభ్యులు సుమారు 60 మందికి షుగరు, బిపి, బిఎండి, సిర్‌పి మరియు ఆర్‌ఏ ఫ్యాక్టర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. మెడికల్ క్యాంపులో వైద్యపరీక్షలు చేయించుకున్న వారికి డాక్టర్ ఉల్చి జయవర్ధన్, డాక్టర్ వేమవరపు మహేష్, పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించి ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు మరియు మందులు అందించడంలో ఉపాస్ హాస్పిటల్ ఎల్లప్పుడూ ముందుంటుందని డైరెక్టర్స్ డాక్టర్ ఉమాపతి చౌదరి, డాక్టర్ ప్రకాష్ చవల, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ అనపర్తి శ్రీనివాస్ తెలియజేశారు. హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం వల్ల ముందస్తు ఆరోగ్య సమస్యలు గుర్తించి సరైన వైద్యం చేయించుకోవడానికి ఉపయోగకరం ఉంటుందని తెలిపారు. హెల్త్ స్క్రీనింగ్ క్యాంపులో వెంకటేష్‌బాబు, ఫుడ్ కార్పొరేషన్ అఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యసేవలందిస్తున్న డాక్టర్

సాగునీటి కాలువల

మరమ్మతులు తక్షణమే చేపట్టాలి..

కలెక్టర్ వెంకటమురళి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో సాగునీటి కాలువల మరమ్మత్తులు తక్షణమే చేపట్టాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీక్షణ సమావేశ మందిరంలో ఆయన నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని బాపట్ల, వేమూరు,రేపల్లె, పర్చూరు, చీరాల నియోజకవర్గాలలో నీటిపారుదల శాఖకు కాలువల మరమ్మతులు, నిర్వహణ కింద మొత్తం 454 పనులకు రూ.12.59 కోట్ల నిధుల మంజూరుకు క్యాబినెట్ ఆమోదం లభించిందని కలెక్టర్ తెలిపారు. తాగునీటికి సంబంధించి ఈ నెల పదో తేదీన నీటిని కాలువల్లో నీటి సరఫరా నిలుపుదల చేసినందున కాలువలు పొడిగా ఉన్నాయని, వాటికి మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. జూన్ నెల మొదటి వారం నుంచి వర్షాలు వచ్చే పరిస్థితి ఉన్నందున ఆపనులను ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలని, సాగునీటి కాలువలన్ని అద్దంలా ఉండాలని ఆయన అన్నారు. పనులను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తూ, వాటి పురోగతిని తెలియజేయాలని ఆయన అన్నారు. కాలువలు జిల్లాలో మొదలయ్యే కిలోమీటర్ నుండి చివరి వరకు ప్రతి రెండు కిలోమీటర్లకి ఒక ఇంజనీరింగ్ అసిస్టెంట్ చొప్పున, వారిపై పర్యవేక్షణకు ఏఈ లను నియమించాలని ఆయన అధికారులకు సూచించారు. వారి వివరాలను నివేదిక రూపంలో తెలియజేయాలని ఆయన తెలిపారు. కాలువలను పరిశీలిస్తూ, ఎక్కడైనా పనులు అవసరమైన, వాటిని పూర్తిచేసి రానున్న కాలంలో కాలువ కట్టలకు గండి పడకుండా చూడాలన్నారు. మరమ్మత్తుల అనంతరం వ్యవసాయ సీజన్‌లో భవిష్యత్ ఏ కిలోమీటర్ వద్దనైనా కాలువకు గండిపడితే అక్కడ విధులు నిర్వహించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన మరమ్మత్తుల పనులు పూర్తి అయిన తర్వాత ఆ పనులు పర్యవేక్షణకు ఒక కమిటీని నియమిస్తామని, వారే స్వయంగా ఆ పనులను తనిఖీ చేస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు. పనులలో ఎక్కడైనా నాణ్యతా లోపాలు గమనించినట్లయితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోబడతాయని ఆయన అన్నారు. పి జి ఆర్ ఎస్ లో రైతుల నుండి కాలువలపై వివిధ రకాల ఫిర్యాదులు వస్తున్నాయని, కాలువలకు గండ్లు పడి కాలువలో నీరు పంటపొలాల్లోకి వస్తున్నాయని, దాని వలన వారు చాలా ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన తెలిపారు. పేద రైతును కాపాడాల్సిన బాధ్యత నీటిపారుల శాఖ అధికారులపై ఉందని ఆయన అన్నారు. గతేడాది సెప్టెంబర్ నెలలో కేటాయించిన పనుల పురోగతిపై ఆయన ఆరా తీశారు. కేటాయించిన పనులను పూర్తి చేయకపోవడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. మొత్తం పనులను ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలన్నారు. పూర్తిచేయని అధికారులపై కఠిన చర్యలు తీసుకోబడతాయని ఆయన తెలిపారు. నల్లమడ డ్రైన్ ల్యాండ్ ఎక్విజిషన్ సంబంధించి నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. బాపట్లకు నీటి సరఫరా, నిల్వల పై బాపట్ల మున్సిపల్ కమిషనర్ ను ఆరా తీశారు. బాపట్ల సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ లో నీటినిల్వల పెంపుపై నివేదిక తయారు చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో గుంటూరు నీటిపారుదల శాఖ ఎస్.ఇ పి వెంకటరత్నం, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి పి గ్లోరియా, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, డ్రైనేజీ ఈ ఈ మురళీకష్ణ, రేపల్లె డ్రైనేజీ ఈ ఈ ఎం. ప్రేమ్‌కుమార్, నీటిపారుదల, డ్రైనేజీ శాఖలకు సంబంధించిన డిఇలు, ఏఈలు పాల్గొన్నారు.

నారా లోకేష్‌కు ఘన స్వాగతం

నాగులుప్పలపాడు మండలం, అమ్మనబ్రోలులో వీరయ్యచౌదరి కుటుంబసభ్యులను పరామర్శించేందుకు రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గురువారం విచ్చేశారు. ఈ సందర్భంగా లోకేష్‌కు మంత్రులు డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ తమీమ్‌అన్సారియా, ఎస్పీ దామోదర్, జేసీ గోపాలకృష్ణ, ఎమ్మెల్యేలు ఘనస్వాగతం పలికారు.

- ప్రజాశక్తి, నాగులుప్పలపాడు



నారా లోకేష్‌తో ఎస్పీ దామోదర్ కరచాలనం



లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా, జేసీ గోపాలకృష్ణ



వీరయ్యచౌదరి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న నారా లోకేష్



నారా లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్